పరిసరాల పరిశుభ్రతను పాటించాలి

విశాలాంధ్ర - బేస్తవారిపేట : ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలని ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు అన్నారు. మండలంలోని పూసలపాడు గ్రామ పంచాయతీలో గురువారం "జల సురక్ష మాసం" కార్యక్రమము నిర్వహించారు. ఓహెచ్ఆర్ఎస్ ట్యాంకుల ను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయించారు. బోర్ వెల్స్ వద్ద పరిసరాలను శుభ్రంగా చేశారు. గ్రామంలో నీటి సమస్యలు ఏమైనా ఉన్నాయా అని ప్రజలను అడిగి తెలుసుకోవడం జరిగింది. అనంతరం సచివాలయాన్ని పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ జిలాని బాషా, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ తావూ నాయక్, పంచాయతీ కార్యదర్శి రంగస్వామి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర ప్రకాశం జిల్లా

పది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

విశాలాంధ్ర-దొనకొండ: మండలంలోని మల్లంపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో 65 మంది 10వ తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్‌ను ప్రధానోపాధ్యాయులు ఆనందబాబుతో కలిసి వైసీపీ నాయకులు గురువారం అందజేశారు. బూచేపల్లి వెంకాయమ్మ సుబ్బారెడ్డి ట్రస్ట్ ద్వారా దర్శి నియోజకవర్గం, చీమకుర్తి, అద్దంకి ప్రాంతాల్లో ప్రతి ఏడాది పది విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్ మీడియం స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల విద్యాభివృద్ధికై బూచేపల్లి కుటుంబం చేస్తున్న విశిష్ఠ సేవలను వారు కొనియాడారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు కాలూరి అజయ్ రమణ, ముడమంచు చిన్న యల్లయ్య, దూదేకు ఇస్మాయేల్, యరగొర్ల బాలక్రిష్ణ, ముడమంచు చిన్న ముసలయ్య, బత్తుల శ్రీను, చింతగుంట్ల నాగార్జున, చింతగుంట్ల స్వామిదాసు తదితరులున్నారు.

విద్యార్థులకు ఫ్లోర్ మ్యాట్‌లు అందజేత

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండలంలోని గొట్ల గట్టు జిల్లా పరిషత్ వలస పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు ఫ్లోర్ మ్యాట్లను పాఠశాల సీనియర్ ఉపాధ్యాయుడు ఎంవి నారాయణ ఉపాధ్యాయ రాళ్లు వారి సొంత నిధులతో అందజేసినట్లు పాఠశాల ప్రధానో పాధ్యాయుడు టి.ఆదినారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో మొత్తం 515 మంది విద్యార్థులు ఉన్నారు వారు పాఠశాలకు జరిగే సమావేశాలు మీటింగులు స్వాతంత్ర దినోత్సవాలు రిపబ్లిక్ డే తదితర సమావేశాలప్పుడు నేలపై కూర్చుండాన్ని సహించని ఉపాధ్యాయు రాళ్లు కూర్చుండేందుకు పట్టాలను అందజేశారు. పట్టలు అందజేసిన ఉపాధ్యాయుడు ఆదినారాయణ ఉపాధ్యాయు రాలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆదినారాయణ విద్యార్థులు అభినందనలు తెలిపారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ ముగ్గురికి గాయాలు

విశాలాంధ్ర-ముండ్లమూరు : రెండు ద్విచక్ర వాహనాలు ఒకదాని వెనుక ఒకటి ఢీకొనడంతో ముగ్గురు గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల కేంద్రమైన మండలములో గురువారం చోటుచేసుకుంది. 108 సిబ్బంది తెలిపిన ప్రకారం ముండ్లమూరు మండలం తమ్మలూరు గ్రామానికి చెందిన దాసరి కోటయ్య వేములబండ గ్రామానికి చెందిన పాలెపోగు సర్జన్ రావు వాహనంపై పసుపుగల్లు గ్రామం వైపు నుండి ముండ్లమూరు వస్తున్నారు. దర్శి మండలం చందలూరు గ్రామానికి చెందిన మధు ద్విచక్ర వాహనంపై అద్దంకి వెళ్తున్నారు ఈ క్రమంలో ముండ్లమూరు సమపంలోనే బ్రహ్మం గుడి వద్ద రాగానే ఒకదాని వెనక ఒకటి ఢీకొన్నాయి ఇక్కడ ఈ ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి 108 వాహనంలో ముండ్లమూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు.

ధాన్యం నాణ్యత తగ్గనివ్వొద్దు

విశాలాంధ్ర -తాళ్లూరు: రైతులు ఖరీఫ్‌లో పండించిన వరి ధాన్యాన్ని రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ మద్దతు కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్ముకోవాలని జిల్లా వ్యవసాయాధికారి (జెడీఏ) శ్రీనివాసరావు కోరారు. లక్కవరంలో రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన మద్దతు కొనుగోలు కేంద్రాన్ని ఆయన గురువారం పరిశీలించారు. తేమ శాతం 17 ఉండేలా ఆర బెట్టుకుని జల్లెడ వేసుకుని నాణ్యతా ప్రమాణాలు తగ్గకుండా రైతులు చూసుకోవాలని, ప్రభుత్వ మద్దతు ధరకు సొసైటీల ద్వారా కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. మండలంలో డిశంబర్ మూడవ వారంలో 374 ఎకరాలు , 4వ వాకంలో 650 వరకు వరి పంట కోతకు వస్తుందని ఎవో ప్రసాద రావు చెప్పారు. రైతుల అవసరాలు పోను, మిగిలినవి మద్దతు ధరకు అమ్ముకోవాలని సూచించారు. రైతు సేవా కేంద్రంలో వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తూము లక్ష్మి రెడ్డి, బొడ్డు హనుమా రెడ్డి, విఏఏ బార్గవి, సొసైటీ సీఈఓ ఎస్ శ్రీనివాస రెడ్డి లు పాల్గొన్నారు.

జెడ్పీ పాఠశాల తనిఖీ

విశాలాంధ్ర -తాళ్లూరు: మండలంలోని తూర్పుగంవరం జెడ్పీ ఉన్నత పాఠశాలను సివిల్ సప్లయర్స్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ , మండల ప్రత్యేక అధికారి ఎ కుమార్, ఎంపీడీఓ పి అజిత లు పాఠశాలను అకస్మికంగా తనిఖీ నిర్వహించారు. పాఠశాలలో మౌలిక వసతులను , పాఠశాలలో విద్యార్థుల బోధన ను పరిశీలించారు. విద్యార్థులతో కలసి మధ్యాహ్నబోజనం చేసారు. మినరల్ వాటర్ ప్లాంట్ కూడ పని చేస్తుండం, బోజనం నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేసారు. మండల విద్యాశాఖాధికారి జి . సుబ్బయ్య, ఎంఈఓ -2 సుధాకర్ రావు, పాఠశాల హెచ్‌ఎం వైఎస్ ఆర్ కే ప్రసాద్ (కన్నయ్య మాస్టార్) పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ వెల్లడి
- రూ.5 కోట్ల అభివృద్ధి పనులకు భూమి పూజ

విశాలాంధ్ర -ఒంగోలు :

అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తెలిపారు. ఒంగోలు నగరంలో పర్యటించి 5 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు ఒంగోలు ఎమ్మెల్యే గురువారం శంకుస్థాపన చేశారు. ప్రతి పేదవాడికి సంక్షేమాన్ని అందించేందుకు ప్రతిగ్రామాన్ని, ప్రతి పట్టణాన్ని అభివృద్ధి చేసేందుకు చంద్రబాబు సారథ్యంలో తాము పనిచేస్తున్నామని దామచర్ల పేర్కొన్నారు. ముందుగా ఒంగోలు నగరంలోని 19వ డివిజన్ భాగ్యనగర్ 4వ లైన్ వద్ద నుండి తుబాకో కార్యాలయం వరకు 1.50 కోట్లతో నూతంగా నిర్మించునున్న సీసీ డ్రైనేజీ కాలువకు శంకుస్థాపన కార్యక్రమం కార్యక్రమం చేపట్టడం జరిగినది. 32వ డివిజన్ లోని రాజీవ్ నగర్ తేజస్విని అపార్ట్మెంట్ వద్ద 1.15 కోట్లతో నిర్మించునున్న సీసీ రోడ్డు, సీసీ డ్రైనేజ్ కాలువకు శంకుస్థాపన చేయడం జరిగినది, 9వ డివిజన్ ఇందిరమ్మ కాలనీ లలోని అడ్డరోడ్డు నందు 2.35 కోట్లతో నిర్మించునున్న సీసీ రోడ్డు, సీసీ డ్రైనేజ్ కాలువకు శంకుస్థాపన చెప్పటడం జరిగినది. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ ఒంగోలు నగరంలో కూటమి ప్రభుత్వం వచ్చాక సుమారుగా 120 కోట్ల పైగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగినది. 700 కోట్ల రూపాయలు పైగా రోడ్ల విస్తరణకు ప్రతిపాధనలు సిద్ధం చేయడం జరిగినది త్వరలో ప్రతి రోడ్డు కూడా నిర్మించి సుందరికరణ చేపట్టడం జరుగుతున్నది తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉడా చైర్మన్ షేక్ రియాజ్, మేయర్ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరావు, టీడీపీ నాయకులు మరియు అధికారులు పాల్గొన్నారు.

'పేస్'లో యాంటీ డ్రగ్ ప్లెడ్జ్

విశాలాంధ్ర- ఒంగోలు :

స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో యాంటీ డ్రగ్ ప్లెడ్జ్ అండ్ సిగ్నేచర్ క్యాంపియన్ గురువారం నిర్వహించారు. ఇందులో భాగంగా కళాశాల ఈగల్ క్లబ్ ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్ ప్రతిజ్ఞ చేయించడం జరిగింది అలాగే విద్యార్థిని విద్యార్థులు మరియు అధ్యాపక బృందం పాల్గొని సంతకాలు చేయడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రధానంగా విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా కళాశాల ఈగల్ పనిచేస్తుందని అవగాహన సదస్సులు డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాల ప్రభావం పై విద్యార్థులను చైతన్య పరచడము విద్యార్థులకు మానసిక ఆరోగ్యం పై మార్గదర్శనం అందించడం అని పేర్కొన్నారుఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి వి కే మూర్తి, డీన్ అకాడమిక్స్ డాక్టర్ సి వి సుబ్బారావు డీన్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ ఆర్ వీరాంజనేయులు మరియు ఏవో ఎం రాంబాబు పాల్గొన్నారు ఈ కార్యక్రమం కళాశాల ఈగల్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ పి బ్రహ్మం ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించడం జరిగింది.

పేదలకు స్మార్ట్ జెన్ విద్యార్థులు దుస్తులు పంపిణీ

విశాలాంధ్ర - సింగరాయకొండ : సింగరాయకొండ మండల పరిధిలోని స్మార్ట్ జెన్ గ్లోబల్ పాఠశాల విద్యార్థులు హ్యూమన్ రైట్స్ డే సందర్భంగా స్కూల్ యాజమాన్యం విద్యార్థుల ఆధ్వర్యంలో పాత సింగరాయకొండ తాతయ్య కాలనీలోని పేదలకు విద్యార్థులు సేకరించిన బ్యాగ్స్, బట్టలు, బొమ్మలు, పెన్నులు, పెన్సిల్స్, పలకలు బుధవారం సాయంత్రం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ గీతా రాణి మాట్లాడుతూ పిల్లలలో భ్రాతృత్వ భావనను పెంపొందించెందుకు ఇటువంట క్రియాశీల పాత్ర పోశించిచడం వలన , విద్యార్థులు పేదలపట్ల దయగలిగి ఉండాలని పరోపకారం భూతదయ మనిషిని మహనీయుని చేస్తుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ శ్రీనివాసులు పాఠశాల ప్రిన్సిపాల్ కే లలితారావు, స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దోర్నాల బస్టాండ్‌కు అధికారిక ప్రకటన

విశాలాంధ్ర-పెద్ద దోర్నాల : రాష్ట్ర నలుమూలల నుండి శ్రీశైలం వెళ్లే భక్తులకు ప్రధాన బస్టాండ్‌గా ఉన్న దోర్నాల బస్టాండ్ నేటికీ లేకపోవడం, స్థలం వివాదాల్లో ఉండటం వంటి సమస్యలను అధిగమించి కలెక్టర్‌చే అధికారికంగా బస్టాండ్‌కు స్థలం కేటాయించినట్లు కలెక్టర్ ప్రకటన చేయడంతో, గురువారం దోర్నాల కూటమి నాయకులు, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు, చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బట్టు సుధాకర్ రెడ్డి, జనసేన మండల కన్వీనర్ కేతు వెంకట మోహన మురళి, దొడ్డ శేషాద్రి, చంటి,. కొప్పుల వెంకట సుబ్బారెడ్డి, యామా దాసయ్య, గుర్రం ప్రసాదు, ఫీల్డ్ అసిస్టెంట్ రామిరెడ్డి, చెన్నారెడ్డి, వై.చెంచయ్య, పఠాన్ ఖాన్,కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

అర్హులను పీఎంఎంవీవై నందు నమోదు చేయాలి

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరి ప్రాజెక్టు సమావేశము గురువారం స్థానిక కనిగిరి ఐసిడిఎస్ కార్యాలయం ఆవరణలో జరిగింది. సెక్టార్ పరిధిలోని గల కనిగిరి, పామూరు, పిసీపల్లి మండలాల అంగన్వాడి కార్యకర్తలు హాజరైయ్యారు. సిడిపిఓ పి.సరోజినీ మాట్లాడుతూ పిల్లల బరువులు గురించి, ప్రధానమంత్రి మాతృ వందన యోజన నందు అర్హులైన లబ్ధిదారులను ఆన్లైన్ నందు నమోదు చేసినట్లయితే వారికి ప్రభుత్వం వారి నుంచి అర్హతను బట్టి 5000, 6000 నగదు మంజూరు చేస్తారని తెలిపారు.. సూపర్వైజర్లు కోఆర్డినేటర్ మాట్లాడుతూ పీఎంఎంవీవై లాగిన్ నందు డ్యూ లిస్టులో ఉన్నవి వెంటనే పూర్తి చేయాలన్నారు. అంగన్వాడి కార్యకర్తలు కొంత మంది వారి కున్నసందేహాలను దృష్టికి తీసుకురాగా అవి నివృత్తి చేయడం జరిగింది. సమావేశంలో సూపర్వైజర్లు పార్వతీ, జరిన, పద్మజా, సుమతి, మల్లేశ్వరి, ధనలక్ష్మి కోఆర్డినేటర్ అశ్విని పాల్గొన్నారు.

ఎమ్మెల్యే స్టిక్కర్ వేసుకున్న వ్యక్తి అరెస్టు

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : నకిలీ ఎమ్మెల్యే స్టిక్కర్ వేసుకున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు యర్రగొండపాలెం సీఐ అజయ్ కుమార్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు, ఎస్డీపీఓ మార్కాపురం, యర్రగొండపాలెం సీఐ పర్యవేక్షణలో యర్రగొండపాలెం మండలం మిల్లంపల్లి టోల్ ప్లాజా వద్ద ఎస్సై పి.చౌదయ్య, సిబ్బంది ఉదయం 8 గంటల సమయంలో వెహికల్ చెకింగ్ నిర్వహిస్తుండగా ఏపీ 07 డిజెడ్ 1807 నంబర్ గల టాటా ఇతియోస్ కారును పరిశీలించగా షేక్ మున్వర్ అనే వ్యక్తి కారు అద్దానికి ఎమ్మెల్యే స్టిక్కర్, కారు నెంబర్ ప్లేటులో డీ అనే అక్షరమునకు బ్లూ కలర్ స్టిక్కర్ను వేసి నంబర్ కనపడకుండా ఉండగా, దాని గురించి ఎస్ఐ కారు డ్రైవర్ని అడగగా అతను గతంలో గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు వద్ద డ్రైవర్‌గా పని చేసినట్లు, ఆ సమయంలో గడువు తీరిన ఎమ్మెల్యే స్టిక్కర్ను తీసుకొని దానిపై వినుకొండ ఎమ్మెల్యే పేరు మీద నకిలీ స్టికర్ తయారు చేయించి, దానిని నిందితుడి తన కారు ముందు భాగాన పెట్టుకొని బాడుగులకు తిప్పుకుంటూ టోల్గేట్‌లో వద్ద, ఫారెస్ట్ టోల్గేట్లు వద్ద డబ్బులు కట్టకుండా ఉండటం, మార్పింగ్ చేయడం, నంబరు ట్యాంపరింగ్ చేయడం మొదలగు నేరాల కింద అతనిని అరెస్ట్ చేయడం జరిగింది. ఈ మధ్యకాలంలో కొంతమంది పోలీసు వారు కాకపోయినా పోలీస్ అని, అలాగే మీడియా వారు కాకపోయినా మీడియా అని, అలాగే ఎమ్మెల్యేల స్టిక్కర్లను, వివిధ గవర్నమెంట్ లోగోలను వారికి సంబంధం లేకపోయినా వాడుతూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. కావున అలాంటి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలియజేశారు. ఎస్సై పి.చౌదయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ స్టేట్ సెక్రెటరీగా మీర్జా షంషీర్ అలీబెగ్

విశాలాంధ్ర-మార్కాపురం :

రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సెక్రెటరీగా డాక్టర్ మీర్జా షంషీర్ అలీబెగ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ కేంద్ర కమిటీ నుండి ఆయనకు అధికారికంగా గురువారం ఉత్తర్వులు అందాయి. ఈయన గత వైసిపి ప్రభుత్వం హయాంలో ఏపి మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా కొద్దికాలం బాధ్యతలను నిర్వర్తించారు. అలాగే 2014 - 2024 మధ్య కాలంలో పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీగా కూడా పనిచేశారు. 2014, 2019,2024 సంవత్సరాలలో జరిగిన శాసన సభ,లోక్ సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయం కోసం తీవ్రంగా కృషి చేశారు. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ప్రత్యేకంగా మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేశారు. ఈయన పార్టీ ఆవిర్భావం నుండి అదే పార్టీలో కొనసాగుతూ చురుకైన పాత్ర పోషిస్తూ పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం శాయు శక్తుల కృషి చేస్తూ వస్తున్నారు. పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు ప్రతి కార్యక్రమంలో పాల్గొంటూ పార్టీ అభివృద్ధి కోసం అకుంఠిత దీక్షతో పాడుపడుతూ ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల అభిమానాన్ని చూరగొంటున్నారు. అలీబెగ్ సామాజిక దృక్పథంతో వెనుకబడిన పశ్చిమ ప్రకాశంలో ఏవన్ గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాలను స్థాపించి పేద విద్యార్థులకు సాంకేతిక విద్యను అందిస్తూ ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అలాగే డాక్టర్ మీర్జా షంషీర్ అలీబెగ్ చారిటబుల్ ట్రస్ట్ ను ఏర్పాటు చేసి అనేక సేవా కార్యక్రమాలను చేపట్టడం జరిగింది. పార్టీ స్టేట్ సెక్రెటరీగా నియమితులైన సందర్భంగా డాక్టర్ మీర్జా షంషీర్ అలీబెగ్ కు నియోజక వర్గ పార్టీ ఇన్చార్జి,మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, పార్టీ స్టేట్ సెక్రటరీ కెవి రమణా రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, బిసి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పి ఎల్ పి యాదవ్, వైసిపి ఇంటలెక్చువల్ విభాగం రాష్ట్ర సెక్రెటరీ మేడా బద్రీనాథ్, పార్టీ రాష్ట్ర నాయకులు వైవి వెంకటేశ్వర రావు, పొదిలి పట్టణ పార్టీ అధ్యక్షులు సానికొమ్ము శ్రీనివాస రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు పోరెడ్డి చెంచిరెడ్డి, తర్లుపాడు మండల పార్టీ అధ్యక్షుడు మురారి వెంకటేశ్వర్లు, పార్టీ డాక్టర్స్ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ సయ్యద్ మక్బూల్ భాష తో పాటు పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన భోజనం అందించాలని మండల ప్రత్యేక అధికారి సిహెచ్ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని మారెళ్ళలో గల ఎస్సీ హాస్టల్‌ను గురువారం రాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా పాఠశాల గదులను, తయారుచేసిన వంటలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ హాస్టల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల పథకాలను విద్యార్థులకు అందించాలన్నారు. చదువులో వెనుకబడి విద్యార్థులపై ప్రత్యేక సారించాలన్నారు. విద్యార్థులు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఎంపీడీవో పి.శ్రీదేవి, డిప్యూటీ ఎంపీడీవో ఆర్ జనార్ధన్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ఏ హనుమాన్ బాబు, పంచాయతీ కార్యదర్శి జివిఎస్ కే.పరమేశ్వరి, హాస్టల్ వార్డెన్ బి.నరసింహారావు పాల్గొన్నారు.

మాజీ మంత్రి బానినేనికి శుభాకాంక్షలు

విశాలాంధ్ర -తాళ్లూరు: ప్రకాశం జిల్లా జనసేన నాయకులు, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డిని ముందస్తు జన్మదిన శుభాకాంక్షలను తాళ్లూరు జెడ్పీటీసీ మారం వెంకట రెడ్డి, బెల్లంకొండ వారి పాలెం సర్పంచి పోశం సుమలత శ్రీకాంత్ రెడ్డిలు తెలిపారు. హైదరా బాద్ లో ఆయన నివాసంలో బాలినేని ని ప్రత్యేకంగా కలసి పుష్పగుఛ్ఛం అందించి, మిఠాయిలు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సేవ కోసం మరిన్ని పదవులు అధిరోహించి ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కొర్రపాటి శ్రీనివాస రావు (చంటి) తదితరులు పాల్గొన్నారు.

వెలిగండ్ల పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తుల బహూకరణ

విశాలాంధ్ర -వెలిగండ్ల : క్రీడాకారులను ప్రోత్సహించడం పాఠశాల అభివృద్ధికి దోహదపడటం అభినందనీయమని ఎంపీడీవో ఆర్ గంగాధర్ అన్నారు. గురువారం మండలంలోని వెలిగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెలిగండ్ల నందు 30,000 రూపాయలు విలువ చేసే క్రీడా దుస్తువులను, పాఠశాల పూర్వ విద్యార్థులు ఈర్ల జ్యోతి, అనిశెట్టి వెంకట నారాయణ బహుకరించారు. పూర్వ విద్యార్థులు క్రీడాకారులు అయినా ఈర్ల జ్యోతి క్రీడాకోటాలో గిద్దలూరు మండలం, ఉయ్యాలవాడ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో, వ్యాయామ ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తున్నారు. అనిశెట్టి వెంకట నారాయణ వెలిగండ్లలోని లక్ష్మి గణపతి చౌడేశ్వరి హార్డ్వేర్ షాప్ వారు క్రీడా దుస్తువులు బహుకరించారు జాతీయ స్థాయి ఖో -ఖో పోటీలకు ఎంపికైన కె. వెంకటసాయిని అభినందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో బి.వి జనార్దన్ రాజు, జెఎస్ డబ్ల్యూ పెయింట్స్ నెల్లూరు, ప్రకాశం మేనేజర్ ఎస్.కె.ఖాసీమ్ పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయుడు మధుసూధన్ రెడ్డి, వ్యాయమ ఉపాధ్యాయుడు భవనం కాశీ విశ్వనాధరెడ్డి, పీ.ఇ.టీ బి.రామకృష్ణ ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు క్రీడా దుస్తుల కార్యక్రమంలో పాల్గొన్నారు.

నవోదయ మోడల్ టెస్ట్

విశాలాంధ్ర-పెద్దారవీడు : మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల గొబ్బూరు నందు నవోదయ మోడల్ టెస్టు నిర్వహించడమైనది. అధ్యక్షులుగా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులులైన పి.ప్రభాకర్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దేవరాజు గట్టు కాంప్లెక్స్ చైర్మన్ ఎస్.కె రసూల్ ఈ మోడల్ టెస్ట్ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలియజేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయులైన పి.వెంకటస్వామి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల పిల్లల్లో పోటీ తత్వం పెరుగుతుందని తెలియజేశారు. పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ ఏలూరు గరిటారెడ్డి మా పాఠశాలలో నిర్వహించడం సంతోషకరంగా ఉందని ఉపాధ్యాయులు బాగా కృషి చేసి కోచింగ్ ఇస్తున్నారని అన్నారు.

శిక్షణ మరియు ఉత్పత్తి కేంద్రం, ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు & వయోవృద్ధుల సహాయ సంస్థ
(ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ యాజమాన్య సంస్థ)
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

టెండర్ నోటీసు నెం.3/TCPC/TCMFT/2025, తేది : 12-12-2025

టెండర్ నోటీసు నెం.3, ప్రకాశం జిల్లా, ఒంగోలులోని శిక్షణ మరియు ఉత్పత్తి కేంద్ర, ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు & వయో వృద్ధుల సహాయ సంస్థ తరఫున, ట్రై సైకిల్ విడి భాగాలు, C.R. పైపులు, C.R. షీట్లు, ఇతర హార్డ్‌వేర్ సామాగ్రి, మామిడి పలకలు మరియు పెయింట్స్, వాటి రవాణా ఛార్జీలతో సహా సరఫరా చేయుటకు, ఆన్‌లైన్ (https://tender.apeprocurement.gov.in ద్వారా టెండర్లు ఆహ్వానించబడుతున్నాయి. బిడ్ డౌన్‌లోడ్ ప్రారంభం **12-12-2025** ఉదయం **10.00** గంటలకు మరియు బిడ్ సమర్పణకు చివరి తేది : **20-12-2025** సాయంత్రం **5.00 గంటలకు.** మరిన్ని వివరాలకు టెండర్ నోటీసులు మరియు బిడ్ పత్రాలు www.tender.apeprocurement.gov.in వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

(తరపున) సంయుక్త కలెక్టర్ & ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్
ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు & వయో వృద్ధుల సహాయ సంస్థ
ప్రకాశం జిల్లా, ఒంగోలు

స్పందన విద్యాసంస్థలకు అవార్డుల పరంపర

విశాలాంధ్ర-రాచర్ల : హైదరాబాద్ హైటెక్స్‌లో బ్రెయిన్‌ఫీడ్ సంస్థ నిర్వహించిన ఎడ్యుటెక్ సదస్సులో స్పందన విద్యాసంస్థలకు వరుసగా మూడో ఏడాది కూడా అబ్దుల్ కలాం బెస్ట్ స్కూల్ అవార్డును ప్రదానం చేసినట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఈ అవార్డును స్పందన విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ పేర్ల సుధీర్ కుమార్ రెడ్డి గురువారం జరిగిన కార్యక్రమంలో స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన, సమగ్ర విద్య అందించడంలో స్పందన విద్యాసంస్థలు అవలంబిస్తున్న ప్రమాణాలు, విద్య పట్ల చూపుతున్న అంకితభావానికి ఈ అవార్డు ప్రతిఫలమని భావిస్తున్నామన్నారు. విద్యార్థులను అన్ని పోటీ పరీక్షల్లో ముందంజలో నిలిపేందుకు నిరంతరం మార్గనిర్దేశం చేస్తూ వారిని ముందుకు నడిపిస్తున్న ఉపాధ్యాయినీ-ఉపాధ్యాయులకు ఈ అవార్డును అంకితం చేస్తున్నానని తెలిపారు. అలాగే, సంస్థపై విశ్వాసం ఉంచి నిరంతరం సహకరిస్తున్న తల్లిదండ్రులు, విద్యార్థులు, సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధి హామీ పనులపై సమీక్ష

విశాలాంధ్ర-పీసీపల్లి : మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం కింద మండలంలోని అన్ని గ్రామాల్లో కూలీలకు పనులు కల్పించాలని ఎంపీడీవో జీవీ కృష్ణారావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లతో గురువారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. అన్ని గ్రామాలలో పనులు ప్రారంభించి ఉపాధి శ్రామికులను గుర్తించాలన్నారు. ఈ నేపథ్యంలో పనులు కోరిన ప్రతి కుటుంబానికి వందరోజుల పనిని కల్పించాలని ఆదేశించారు. పని దినాలను పంచాయతీల వారీగా విభజించి ప్రతి ఫీల్డ్ అసిస్టెంట్‌కు టార్గెట్‌లను నిర్దేశించినట్లు పేర్కొన్నారు. టార్గెట్ ప్రకారం పనుల డిమాండ్లు పెట్టి ప్రతి గ్రామంలో కూలీలకు విధిగా పనులు కల్పించాలన్నారు. సమావేశాలకు సక్రమంగా హాజరకాని సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో కే చిన్న కొండయ్య టెక్నికల్ అసిస్టెంట్లు వివిధగ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

'ఆకుపాటి' దంపతుల అన్నప్రసాద వితరణ

విశాలాంధ్ర-పామూరు : పట్టణంలో వెలసి ఉన్న శ్రీ శ్రీ శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవస్థానంలో ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షులు ఆకుపాటి వెంకటేష్, రేణుకల వివాహ వార్షికోత్సవ సందర్భంగా మాల ధారణ స్వాములకు గురువారం అన్న ప్రసాదం వితరణ చేశారు. ఆకుపాటి వెంకటేష్ తల్లిదండ్రులు రమణయ్య, రాములమ్మ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం చైర్మన్ గుత్తి వెంకటరాజా, స్వామివారి తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్ర పటాన్ని బహుకరించారు. అయ్యప్ప, భవానీ, గోవింద, శివ, ఆంజనేయ స్వాములు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

మాజీ సర్పంచి ఏలూరికి నివాళి

విశాలాంధ్ర-పామూరు : మండలంలోని కంబాలదిన్నె టిడిపి నేత, మాజీ సర్పంచ్ ఏలూరి నరసింహం ఇటీవల మృతి చెందారు. ఆయన దశ దినకర్మ గురువారం కంబాలదిన్నె గ్రామంలో జరిగింది. టిడిపి పామూరు మండల అధ్యక్షులు బొల్లా నరసింహారావు పాల్గొని నరసింహం చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. మాజీ ఎంపీపీ గుంటుపల్లి దశరథ రామయ్య, పీసీ పల్లె మండల టిడిపి అధ్యక్షులు వేమూరి రామయ్య, మండల మాజీ తెలుగు రైతు అధ్యక్షులు మన్నం రమణయ్య పిసి పల్లి బీసీ సెల్ అధ్యక్షులు కోమటి గుంట్ల వీరయ్య, మండల కస్టర్ కో కన్వీనర్ గోళ్ల వీరబాబు, గోళ్ళ వీరాంజనేయులు, కరణం కొండయ్య, ఏలూరి మధుసూదన్ రావు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

చెప్టా నిర్మాణానికి పనులు ప్రారంభం

విశాలాంధ్ర-పామూరు రూరల్ : మండల కేంద్రమైన పామూరు పట్టణంలోని ఇరువురు రోడ్డు నందు న్యూ వాటర్ ట్యాంక్ మూడవ లైన్‌లో వాహనాలు వెళ్లడానికి సౌకర్యం లేక నిరుపయోగంగా ఉన్న రోడ్డుకు కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాలతో తెలుగుదేశం పార్టీ నాయకులు, ప్రముఖ పారిశ్రామికవేత్త షేక్ షంషూర్ ఆధ్వర్యంలో చేపట్టిన చెప్టా నిర్మాణ పనులను పంచాయతీ కార్యదర్శి అరవింద రెడ్డి జి అరవింద రెడ్డి ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా పట్టణ టిడిపి ఉపాధ్యక్షులు ఇర్రి కోటిరెడ్డి, ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య యూత్ అధ్యక్షులు పందిటి హరీష్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమముతో పాటు సమస్యలను గుర్తించి పరిష్కరించడమే ధ్యేయముగా శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పనిచేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్యదర్శి షేక్ హాజీ గౌస్, కోడిగుంపల నాయిబ్ రసూల్, తడికమల్ల సుబ్బారావు, స్వయంకృషి నాయబ్ రసూల్, ప్రభుత్వ వైద్యశాల డైరెక్టర్ మొబీనా మౌలాలి, లక్ష్మీనారాయణ, నీలకంఠాచారి, గరికపాటి వెంకటేష్, బత్తుల సత్యం, తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్వ సభ్య సమావేశం

విశాలాంధ్ర-దొనకొండ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళీ అధ్యక్షతన శుక్రవారం సర్వ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వి.వసంతరావునాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లుగా గెలుపొందిన అభ్యర్థులు మాత్రమే పాల్గొనాలన్నారు.

రైతులు నీటిని పొదుపుగా వాడాలి

- కనిగిరి ఎమ్మెల్యే 'ఉగ్ర'
- మోపాడు రిజర్వాయర్‌కు నీరు విడుదల

విశాలాంధ్ర-పామూరు : రైతులు పొదుపుగా నీటిని వినియోగించుకొని పంటలు పండించుకోవాలని కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మోపాడు రిజర్వాయర్ కు ప్రత్యేక పూజలు నిర్వహించి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ రిజర్వాయర్‌లో 17 అడుగుల మాత్రమే నీరు ఉందని, రైతుల కోరికపై విడుదల చేయడం జరిగింది అన్నారు. వృధా చేయకుండా పొదుపుగా వాడుకోవాలన్నారు. అనంతరం జై కో నిధులతో జరుగుతున్న పనులను పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలను పాటించి త్వరితగతిన పూర్తి చేయాలని తగు సూచనలు సలహాలు చేశారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు బొల్లా నరసింహారావు, మోపాడు ప్రాజెక్టు సూపర్ చైర్మన్ చుంచు కొండయ్య, వైస్ చైర్మన్ మోరబోయిన నరసింహారావు, టిడిపి నాయకులు యారవ ప్రసాదు రెడ్డి, ఇరిగేషన్ డి ఈ విజయ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మధ్యంతర భృతిని వెంటనే చెల్లించాలి

ఏపీటీఎఫ్ డిమాండ్

విశాలాంధ్ర-సిఎస్‌పురం : 12వ పిఆర్‌సి కమిటీను వెంటనే నియామకం చేసి, 30శాతం మధ్యంతర భృతి చెల్లించాలని, ఉద్యోగ ఉపాధ్యాయుల బకాయిల చెల్లింపు వెంటనే పూర్తి చేయాలని ఏపీటీఎఫ్ సియస్ పురం మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తోట శ్రీనివాసులు జె.ఎస్ ఆనంద్ బాబు, జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్ రసూల్ డిమాండ్ చేశారు. గురువారం సియస్‌పురం మెయిన్ స్కూల్‌లో ఏపీటీఎఫ్ సమావేశం జరిగింది నాయకులు మాట్లాడుతూ 5 సంవత్సరాల పాటు పెండింగ్‌లో ఉన్న పంచాయతీ రాజ్ డిపార్ట్మెంట్‌లో కారుణ్య నియామకాలు చేపట్టాలని, రిటైర్ అయిన ఉపాధ్యాయుల గ్రాట్యుటీ లీవ్ ఎన్కాష్మెంట్, జిఐఎస్ బిల్లులు చెల్లించాలని, సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న మూడు డిఏలు ప్రకటించాలని, ఉపాధ్యాయులకు బోధనేతర పనులు నుండి విముక్తి కలిగించాలని, అనవసర యాప్ లను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏపీటీఎఫ్ నాయకులు డి.సుబ్బరాయుడు, దండే శ్రీనివాసులు, జి రామక్రిష్ణ చంద్ర శేఖర్ యన్ గాంధీ కె చెన్నయ్య, జి రవీంద్ర, జి వెంకటేశ్వర్లు, ఒంగోలు వెంకటేశ్వర్లు, బి చిన్న నారాయణ, ఆర్ సుబ్బయ్య, యం మధుబాబు, డి పున్నమ్మ, సునీతా దేవి, పెంచల నరసయ్య, ఎలికా శ్రీనివాసులు, బి శ్రీనివాసులు, యన్ మాల్యాద్రి, తదితరులు నూతన డిఎస్సీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకల పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్రపెద్ద దోర్నాల : దోర్నాల పట్టణం నందు భారత్ పెట్రోల్ బంకు దగ్గర ఉన్న క్రీస్తు సంఘము బిల్డింగ్ ఆవరణంలో డిసెంబర్ 15 సోమవారం సాయంత్రం ఎర్రగొండపాలెం పట్టణంలో ఎన్జీవో కాలనీ నందు జరుగుతున్న 25వ సిల్వర్ జూబ్లీ సెమీ క్రిస్మస్ వేడుకలు వాల్ పోస్టర్ దోర్నాల మండల కన్వీనర్ గంట వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో వాల్ పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది, ఈ క్రిస్మస్ వేడుకలు నియోజకవర్గ ఎమ్మెల్యే తాడిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరుగును, ఈ కార్యక్రమంనకు సంబంధించిన వాల్ పోస్టర్లు దోర్నాల మండల వైఎస్సిపి కన్వీనర్ గంట వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమమునకు నియోజకవర్గ పాస్టర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి చాట్ల గంగయ్య, దోర్నాల మండల క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుకు సింగ ఏసు దానము, దోర్నాల మండల పాస్టర్స్ యూనియన్ అధ్యక్షులు పూర్ణ కంటి జేమ్స్, ఏబిసీసీ ప్రెసిడెంట్ యలకపాటి ప్రేమన్న, మండల యూనియన్ జాయింట్ సెక్రెటరీ యలకపాటి రంజిత్ రాజు, క్రీస్తు సంఘము డైరెక్టర్ సింగ రాజేష్, చట్ల రాజు తదితర పాస్టర్లు పాల్గొన్నారు.

జీడి మామిడి పరిశోధన కేంద్రాన్ని సందర్శించిన వ్యవసాయ కళాశాల విద్యార్థులు

విశాలాంధ్ర-సిఎస్‌పురం : కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు వారి విద్యాభ్యాసంలో భాగంగా గురువారం బాపట్లలోని జీడి మామిడి పరిశోధన కేంద్రాన్ని సందర్శించారు. జీడి మామిడిలో జరుగుతున్న పరిశోధనలు మొక్కల పెంపుదల గురించి విద్యార్థులు అడిగి తెలుసుకున్నారు. జీడిమామిడి పరిశోధన స్థానం డైరెక్టర్ డాక్టర్ కే.ఉమామహేశ్వర రావు, విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొపెసర్స్, డాక్టర్ సాయి కోటి, అఖిల్ బాబు, డాక్టర్ సృతి. ఇర్రి ఝాన్సీ, విద్యార్థులు, పాల్గొన్నారు.

ఎడ్జ్ కటింగ్ ఫ్యాక్టరీలో కార్మికుడు మృతి

విశాలాంధ్ర -చీమకుర్తి: చీమకుర్తి గంగా కట్ట వద్ద ఎడ్జ్ కటింగ్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికుడు విద్యుత్ షాక్కు గురై మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే చీమకుర్తి మండలం గంగా కట్ట వద్ద ఎడ్జి కటింగ్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న ఇతర రాష్ట్రానికి చెందిన హిందీ కార్మికుడు విద్యుత్ షాకు గురై మృతి చెందాడు. అయితే ఈ ఫ్యాక్టరీకి ఎటువంటి అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా ఎడ్జి కటింగ్ ఫ్యాక్టరీ నడుపుతున్న యజమానిని పోలీసులు అరెస్ట్ చేయకపోవడం పై కార్మికులు రోడ్డెక్కి సమ్మెబాట పట్టారు. సంఘటన జరిగి రెండు రోజులు అవుతున్న యజమానిని అరెస్ట్ చేయకపోవడం పై కార్మికుల విమర్శలు చేస్తున్నారు. కార్మికుడు కుటుంబానికి న్యాయం చేయాలని కార్మికులు కోరుతున్నారు.

శుద్ధి చేసిన నీరు అందించడమే లక్ష్యం

విశాలాంధ్ర-ముండ్లమూరు : ప్రజలకు శుద్ధి చేసిన తాగునీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని మండల ప్రత్యేక అధికారి సిహెచ్ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని వేంపాడు గ్రామంలో గురువారం టెన్ కే ఎల్ జి ఎల్ ఎస్ ఆర్ ట్యాంకు జల రక్ష మాస కార్యక్రమంలో భాగంగా శుభ్రం చేయించారు. ట్యాంక్ చుట్టూ పిచ్చి మొక్కలు తొలగించి, శుభ్రం చేయించి బ్లీచింగ్ పిచికారి చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి శ్రీదేవి, డిప్యూటీ ఎంపీడీవో ఆర్ జనార్దన్, ఆర్డబ్ల్యూఎస్ ఏ ఈ ఏ హనుమాన్ బాబు, పంచాయతీ కార్యదర్శి జీవీ ఎస్ కె పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

శబరిమలకు..అయ్యప్ప స్వాములు

విశాలాంధ్ర-పొన్నలూరు : మండలంలోని పరుచూరి వారి పాలెం గ్రామం నుంచి గత 41 రోజుల నుంచి మాల ధరించి ఇరుముడి కట్టుకొని స్వాములు గురువారం శబరిమలకు బయలుదేరారు. పరుచూరి వారి పాలెం గ్రామంలో స్వాములు అయ్యప్ప స్వామి కీర్తనలు చేస్తూ శబరిమలకు బయలుదేరారు, గ్రామంలోని ప్రజలు స్వాముల ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు భక్తులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఔరంగాబాద్‌లో అవార్డు అందుకున్న సయ్యద్ రఫీ

విశాలాంధ్ర-పామూరు రూరల్ : వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (వీఎంపీ) భరత్ గౌరవ్ అవార్డు 2025 బెస్ట్ అవార్డుకు దక్షిణ భారత ఉపాధ్యక్షులు సయ్యద్ రఫీ ఎంపికయ్యారు. బుధవారం వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (విశ్వ మానవ అధికర్ పరిషత్), భరత్ గౌరవ్ అవార్డు 2025 అవార్డుల పంపిణీ ఔరంగాబాద్ కలెక్టర్ బంగ్లా పక్కన హజ్ హౌస్‌లో ఘనంగా జరిగింది. వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నేషనల్ ప్రెసిడెంట్, స్థాపకులు డాక్టర్ ఎం.ఆర్. అన్సారీ, ఎం.అన్వరుల్ హక్, డాక్టర్ జి.ఎస్. కాంబోజ్, షేక్.హమీదుల్లా అజ్మెన్, చేతులమీదుగా సయ్యద్ రఫీకి అవార్డును అందజేశారు.

మాజీ ఎమ్మెల్యే పిడతల రామ భూపాల్ రెడ్డి మృతి

విశాలాంధ్ర - గిద్దలూరు : గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే పిడతల రామ భూపాల్ రెడ్డి(89) స్వర్గస్తులయ్యారు. వయసు రిత్యా కొద్దిగా రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ హైదరాబాదులోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న రామ భూపాల్ రెడ్డి గురువారం తెల్లవారుజామున తుది శ్వాస విడిచారు. పిడతల కుటుంబంలో అన్న పిడతల రంగారెడ్డిని ఆదర్శంగా తీసుకొని రాజకీయాలకు వచ్చిన పిడతల రాంభూపాల్ రెడ్డి రాచర్ల మండల పరిషత్ అధ్యక్షునిగా, 1994 సంవత్సరంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా గెలిచి ఎమ్మెల్యేగా అందరి మన్ననలు పొందేలా పనిచేశారు. పేద ప్రజలు తన దగ్గరకు వస్తే అధికారులను పిలిపించుకొని వారి సమస్యను లబ్దిదారుల ముందే వెనువెంటనే పరిష్కరించే నేతగా గిద్దలూరు నియోజకవర్గంలో గుర్తింపు పొందారు. మాజీ ఎమ్మెల్యే పిడతల రామ భూపాల్ రెడ్డి భౌతికకాయాన్ని అంత్యక్రియల కోసం గిద్దలూరుకు తీసుకొని వచ్చారు. నియోజకవర్గంలోని అనుచర వర్గం పార్టీలకు అతీతంగా భారీ సంఖ్యలో గృహం దగ్గరకు వచ్చి ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. గిద్దలూరు లోని స్వగృహంలో ఆయన అభిమానుల కోసం భౌతికాయాన్ని ఉంచి శుక్రవారం మధ్యాహ్నం స్వగ్రామమైన అనుములవీడులో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు వైఎస్ఆర్సిపి స్టేట్ కౌన్సిల్ సభ్యుడు, కుమారుడు పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డి తెలిపారు. గిద్దలూరు పట్టణ అధికార ప్రతిపక్ష పార్టీలకు చెందిన నేతలు భారీగా తరలివచ్చి నివాళులర్పించారు. మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న నెల్లూరు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డి నంద్యాల మాజీ ఎంపీ గంగుల ప్రతాపరెడ్డి గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే అన్న వెంకట రాంబాబు తనయుడు కృష్ణ చైతన్య భూపాల్ రెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌ల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించండి

విశాలాంధ్ర -తాళ్లూరు: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్స్ దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ గ్రామీణ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ పిలుపు మేరకు తాళ్లూరు మండల ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ గురువారం ఎంపీడీఓ అజితకు వినతి పత్రం అందించారు. 19 సంవత్సరాలుగా మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో గ్రామీణ సుస్థిరత, శాశ్విత వనరులు ఏర్పాటుకు కృషి చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ కనీసం వేతనం రూ. 25వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కూటమి ప్రభుత్వ ఏర్పాటుతో ఫీల్డ్ అసిస్టెంట్‌ల సమస్యలు తీర్చుతారని భావించారని కాని గత ప్రభుత్వం వలే ఫీల్డ్ అసిస్టెంట్స్ తొలగింపు జరుగుతుందని దీనివలన ఆత్మహత్యలు పెరుగుతున్నాయని అన్నారు. మాస్ డేస్ విధానం రద్దు చెయ్యాలని, మండల స్థాయిలో బదిలీ సౌకర్యం కల్పించాలని, అప్‌లోడ్ సర్వర్ లోపాలని సరిదిద్దాలని, విధినిర్వహణలో మృతి చెందిన కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా రూ.25లక్షలు కల్పించాలని, అర్హత, అనుభవం బట్టి పదోన్నతి ఇవ్వాలని కోరారు. ప్రక్క గ్రామాలలో చేయించిన పనిదినాలను వర్క్ చేయించిన ఎఫ్ ఏలకు కలిపాలని అన్నారు. 5 బిజీ నెట్ వర్క్ వాడుతున్న సందర్భంగా కొత్త మొబైల్స్, 5 జిబి సిమ్ కార్డ్స్ ఫీల్డ్ అసిస్టెంట్స్ కు ఇవ్వాలని కోరారు. కూలీలకు బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని కోరారు.

ఖాళీ బిందెలతో సచివాలయం ఎదుట ధర్నా

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరి మున్సిపాలిటీ లోనీ ఆరవ సచివాలయం పరిధిలో గల పాతూరు ప్రాంతంలో గత 15 రోజుల క్రితం మోటర్ కాలిపోయి నీళ్లు రాక ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం మహిళలు ఖాళీ బిందెలతో సచివాలయం ముందు ధర్నా చేశారు. సచివాలయంలో నీళ్ళకు సంబంధించి ఎవరిని అడిగిన సమాధానం రావటం లేదని మహిళలు తెలిపారు. గత 15 రోజుల నుండి ఎంతో ఇబ్బందులకు గురవుతున్నట్టు తెలిపిన మా బాధ పట్టించుకునే నాధుడు లేదని వాపోయారు. మేము కూలి నాలి చేసుకుని జీవించేవారమని, నీళ్లు కొనుక్కొనే స్తోమత మాకు లేదని, ఇప్పటికైనా మా బాధను అర్థం చేసుకొని మున్సిపాలిటీ వారు మోటరు రిపేర్ చేయించి మాకు నీళ్లు సరఫరా చేయమని అధికారులను వేడుకుంటున్నామని మహిళలు కోరుకుంటున్నారు. మహిళలు ధర్నా చేస్తున్న విషయం గురించి సచివాలయంలో ఉన్న సిబ్బందిని అడుగగా అడ్మిన్ సెలవు పెట్టి ఉన్నారని సచివాలయం సిబ్బంది తెలిపారు. ఈ సచివాలయంలో ఇమ్యూనిటీ కార్యదర్శి ఇంచార్జిగా వచ్చారని వారు ఎప్పుడు సచివాలయంలో ఉండకపోవడంతో మేము ధర్నా చేసే పరిస్థితి కలిగిందని మహిళలకు తెలిపారు.

గోకులం షెడ్‌కు భూమి పూజ

విశాలాంధ్ర-పామూరు రూరల్ : కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు నరసింహారెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని కంబాలదిన్నె గ్రామంలో పశు పోషకులు సనుమూరి మాల్యాద్రికి మంజూరైన గోకులం షెడ్‌కు గురువారం మండల మాజీ తెలుగు రైతు అధ్యక్షులు మన్నం రమణయ్య,మాజీ సింగిల్ విద్య అధ్యక్షులు గద్దె గంగయ్య చౌదరి లు భూమి పూజ చేశారు. వారు మాట్లాడుతూ పశుపోషకులైన రైతులకు పాడి పరిశ్రమ ద్వారా ఆర్థిక అభివృద్ధి చెందాలన్న లక్ష్యముతో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం గోకులం షెడ్లను మంజూరు చేయడం జరిగిందన్నారు. మాజీ సర్పంచ్ గోళ్ల కేశవరావు, గోళ్ళ భాస్కరరావు,నల్ల పోతుల రవీంద్ర, సనమూరిమాధవ, చిన్నపాటి వెంకటేశ్వర్లు, ఏపీవో మాల్యాద్రి, వెంకటేశ్వర రెడ్డి, గోళ్ల కొండలరావు, చల్ల ఆదయ్య, గోళ్ళ సింగయ్య, నరసింహారావు పాల్గొన్నారు.

ఘనంగా సెమీక్రిస్మస్

విశాలాంధ్ర-గురువారం : పుల్లలచెరువు మండల కేంద్రంలో పుల్లలచెరువు మండల పాస్టర్స్ ఫెయిత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పుల్లలచెరువు మండల పాస్టర్స్ అధ్యక్షుడు రెవరెండ్ రావూరి ఆనందరావు అధ్యక్షతన సెమీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. సెమీ క్రిస్మస్ వేడుకకు ముఖ్య ప్రసంగీకులుగా మార్కాపురం పట్టణం నుంచి రెవరెండ్ నందిగం ఫ్రాంక్లిన్ ఎఫ్రాయిమ్ పాల్గొని యేసు క్రీస్తు పుట్టుకు సంబంధించిన ప్రసంగాన్ని చేసారు. ఈ సెమీ క్రిస్మస్ వేడుకకు మండల పాస్టర్లు పాల్గొన్నారు.

గంగసాని రితేష్ రెడ్డి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-పామూరు : పామూరు ఎంపీపీ గంగసాని లక్ష్మీ, పామూరు వైసీపీ మండల అధ్యక్షులు గంగసాని హుస్సేన్ రెడ్డి దంపతుల పెద్ద కుమారుడు డాక్టర్ రితీష్ రెడ్డి 24వ జన్మదిన వేడుకలు బుధవారం రాత్రి బెంగళూరులో ఘనంగా నిర్వహించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల నడుమ రితేష్ రెడ్డి కేక్ కట్ చేశారు. తల్లి, తండ్రులు లక్ష్మీ, హుస్సేన్ రెడ్డిలు కేక్ కటింగ్ వేడుకలలో పాల్గొని రితేష్‌రెడ్డికి కేక్ తినిపించి నిండునూరేళ్ల ఆయురారోగ్యాలు కలిగి, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.

జిల్లాస్థాయి ఈఈఎం పరీక్షలకు గొట్లగట్టు పాఠశాల విద్యార్థుల ఎంపిక

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండలంలోని గొట్లగట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న పి వెంకట హర్షవర్ధన్, పదవ తరగతి చదువుతున్న సిహెచ్ నాగ వెంకట ప్రణీత, పదవ తరగతి చదువుతున్న బాల వెంకటేశ్వర్లు ఎడ్యుకేషనల్ ఎం పని మెరిట్ జిల్లాస్థాయి పోటీ పరీక్షలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈ ఆదినారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు అభినందనలు తెలిపారు.

కోటి సంతకాల సేకరణ

విశాలాంధ్ర-జరుగుమల్లి : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు మెడికల్ కాలేజీలో ప్రైవేటీకరణ వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం మాజీ మంత్రి ఆదిమూల సురేష్ నాయకత్వంలో నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల నుంచి సేకరించిన కోటి సంతకాల పత్రాలను ఆదిమూల సురేష్ ఆధ్వర్యంలో క్యాంపు కార్యాలయం నుండి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా క్యాంప్ కార్యాలయంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు దరిశి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి , ఒంగోలు పార్లమెంటు పరిశీలకులు బత్తుల బ్రహ్మానంద రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మాదాసి వెంకయ్య,ఆరు మండలాల వైకాపా అధ్యక్షులు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాజుపాలెం - గిద్దలూరు రహదారి విస్తరణకు గ్రీన్ సిగ్నల్

విశాలాంధ్ర-కొమరోలు : కొమరోలు మండలంలోని రాజుపాలెం నుండి గిద్దలూరు 2వ నెంబర్ మైలు రాయి వరకు సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా మారుస్తూ నిధులు మంజూరు అయినట్లు ఆర్అండ్‌బి అధికారులు వెల్లడించారు. గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి రోడ్డు విస్తరణకు ఆర్అండ్‌బి శాఖ నుండి రూ.4 కోట్లు నిధులు మంజూరు చేయించారని అధికారులు వెల్లడించారు.

ఘనంగా భారతీయ భాషా ఉత్సవ్

విశాలాంధ్ర - చెరుకుపల్లి : ప్రముఖ కవి సుబ్రహ్మణ్య భారతి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న భారతీయ భాష ఉత్సవ్ కార్యక్రమం గుళ్ళపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు వాకా శ్రీనివాసరావు మాట్లాడుతూ సుబ్రహ్మణ్య భారతి భాషా వ్యాప్తి కొరకు ఎన్నో రచనలు చేసి జనాబాహుల్యంలో ఎంతో పేరు గడిచారన్నారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పాఠశాల స్టాఫ్ సెక్రటరీ కరుకుట్ల కిరణ్ ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర బాపట్ల జిల్లా

జనవరి 6 వరకు సెయింట్ఆన్స్‌లో వర్క్ షాప్

విశాలాంధ్ర - చీరాల టౌన్ : స్థానిక సెంటెన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో ఎంటర్ పె న్యూ యర్ షిప్అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ పై వర్క్ షాపు కళాశాలలోని యం.బి.ఎ విద్యార్థులకు 21రోజుల వర్క్ షాపును గురువారం ప్రారంభించినట్లు కళాశాల కార్యదర్శి వనమా రామకృష్ణా రావు మరియు కరస్పాండెంట్ యస్. లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు.ఆంధ్రప్రదేశ్ యం.యస్.యం.ఇ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ వారి సహకారంతో సెయింట్ ఆన్స్‌కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజిలో ని యం.బి.ఎ విభాగ విద్యార్థులకు ఎంట్రపెన్యుయర్ షిప్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్‌పై వర్క్ షాపును ఈనెల 11 నుండి జనవరి 6 వరకు 21 రోజుల పాటు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. జగదీష్‌బాబు తెలిపారు. ఎ.పి యం.యస్.యం.ఇ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ నుండి పి.అన్వేష్ విద్యార్థులకు వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు యం.బి.ఎ విభాగాధిపతి డాక్టర్ ఆర్. ఇమ్మానుయేల్ తెలిపారు.ఈ వర్క్ షాపు ప్రారంభోత్సవ కార్యక్రమములో యం.బి.ఎ విభాగ అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా: అన్నం సతీష్

విశాలాంధ్ర -బాపట్ల : నియోజకవర్గంలోని అందరికీ అందుబాటులో ఉంటానని మాజీ శాసనమండలి సభ్యులు, భారతీయ జనతా పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యులు అన్నం సతీష్ ప్రభాకర్ అన్నారు. అన్నం సతీష్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయన నివాసంలో సతీష్‌కు అన్ని మతాల పెద్దలు సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అభిమానులు ఏర్పాటు చేసిన ప్రత్యేక కేకను కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కేకులు కట్ చేయడంతో పాటు, నరాలశెట్టివారి పాలెం, భారతీయ జనతా పార్టీ కార్యాలయం, నల్లమోతు వారి పాలెం,యాజలి గ్రామాల్లో అభిమానులు ఏర్పాటు చేసిన కేకులను కట్ చేశారు. సతీష్ ఫుడ్ పార్క్ ప్రాంగణంలో వేలాది మందికి అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించి ఏర్పాటు చేసిన కేకులను కట్ చేసి పంచి పెట్టారు.కోలాహలంగా నియోజకవర్గంలో సతీష్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన పుట్టిన రోజును పురస్కరించుకొని తనపై చూ పించిన ప్రేమను రాగాలను ఎప్పటికీ మర్చి పోనని ప్రతి ఒక్కరిని గుర్తు పెట్టుకుంటానని చెప్పారు. తన వద్ద అధికారం ఉన్న, లేకపోయినా నియో జకవర్గ వ్యాప్తంగా అభిమానులు ఒక సోదరుడుగా నమ్మి ఎంతో ప్రేమను పంచుతున్నారని పేర్కొన్నారు.

అన్నంకి శుభాకాంక్షలు

ఉమ్మడి గుంటూరు జిల్లా మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ 51వ పుట్టినరోజు సందర్భంగా సిపిఐ బాపట్ల జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ అంబేద్కర్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొని ఆయన కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రయాణీలకు కనీస సౌకర్యాలు కల్పించాలి

కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

విశాలాంధ్ర -బాపట్ల : ఆర్టీసీ బస్టాండ్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచి ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఆదేశించారు. బాపట్ల పట్టణంలోని ఏపీఎస్ఆర్టీసీ బస్టాండ్ ను కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బస్టాండ్‌లో ఆయన కలియతిరిగారు, ప్రయాణికులతో మాట్లాడారు. అనంతరం పాత బస్సు స్టాప్ కూడలికి ఆయన చేరుకుని పరిశీలించారు. ప్రయాణికులకు తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు లేకపోవడంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. బస్టాండ్ నిర్మాణం జరిగి కొన్నేళ్లు గడుస్తున్నప్పటికీ సౌకర్యాలు లేని బస్సు స్టాప్ వద్ద ప్రయాణికులు అధికంగా ఉండడంపై ఆరా తీశారు. బాపట్ల బస్టాండ్‌లో ఏడు ఫ్లాట్ ఫామ్ లు ఉండగా, ప్రతిరోజు 100కు పైగా బస్సులు వస్తాయని ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ వీరభద్రరావు కలెక్టర్ దృష్టికి తెచ్చారు.

ప్రయాణికులకు తప్పనిసరిగా తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. ఆర్టీసీ బస్సులు లోపలికి వెళ్లే మార్గం, వెలుపలకు వచ్చు మార్గాలను పరిశీలించారు. పార్కింగ్ స్థలం, అద్దెకు ఇచ్చిన వాణిజ్య సముదాయాన్ని ఆయన పరిశీలించారు.వాటి ద్వారా అద్దెలు క్రమంగా వస్తున్నాయా లేదా అని ఆరా తీశారు. డిపో మేనేజర్ కార్యాలయాన్ని, డ్రైవర్లు స్టాఫ్ రెస్ట్ రూమ్ లను పరిశీలించారు. అనంతరం బస్సు స్టాప్ కూడలికి చేరుకున్నారు. అక్కడ వసతి సౌకర్యాలు పరిశీలించారు.ఆయన వెంట ఆర్డిఓ పి గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, తహసిల్దార్ షాలీమా, తదితరులు ఉన్నారు.

ప్రజలకు తాగునీరు అందించటమే లక్ష్యం

విశాలాంధ్ర - రేపల్లె : గ్రామీణ ప్రాంతాల్లో అన్ని గృహాలకు వ్యక్తిగత కొళాయి కనెక్షన్ ద్వారా సురక్షితమైన తాగునీరు అందించే లక్ష్యంతో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 2019 లో హర్ ఘర్ జల్ (ఇంటింటికి నీరు) ప్రారంభించారని టిడిపి నేత అనగాని శివప్రసాద్ అన్నారు. రేపల్లె రూరల్ మండలం బేతపూడి పంచాయతీలో జలజీవన్ మిషన్ ద్వారా రూ. 91 లక్షలతో 3 వాటర్ ట్యాంక్స్ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం గురువారం శివప్రసాద్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ నేతృత్వంలో రేపల్లె నియోజకవర్గంలోని అన్ని పంచాయతీలకు జల్ జీవన్ మిషన్ ద్వారా సురక్షితమైన తాగునీటిని అందజేయడానికి కృషి చేస్తున్నారనారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవిబాబు, కార్యదర్శి నాగేశ్వరావు, ఎంపీడీవో సీనియర్ అసిస్టెంట్ పుష్పకుమారి, తెలుగుదేశం పార్టీ నాయకులు కుడితపూడి నరసింహారావు, కొలసాని రాము, పంతాని సాయికుమార్, బేతపూడి వీరయ్య, కారుమూరు. జ్యోతి, బి .వెంకటేశ్వరరావు, ఎర్రగళ్ల ధర్మ తేజ, ఎస్ఎస్‌వి ప్రసాద్, తాత ఏడుకొండలు షేక్ ఖాదరవల్లి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులకు నిధులు విడుదలపై హర్షం

విశాలాంధ్ర - రేపల్లె : రాష్ట్రంలోని అన్ని నియోజక వర్గాల్లోని పంచాయతీ రోడ్ల మరమ్మతులకు రూ. 2,123 కోట్ల నిధులను విడుదల చేయటం అభినందనీయమని రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్లు స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ హర్ష వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురువారం సచివాలయంలో సహచర మంత్రులతో కలిసి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను కలిసి ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది. ముఖ్యంగా రేపల్లె నియోజకవర్గంకి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గానికి రూ.20.43 కోట్లు విడుదల చేయడంపై మంత్రి అనగాని సత్యప్రసాద్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

మహిళలు అభివృద్ధి చెందాలి:ఏపీఎం

విశాలాంధ్ర - అద్దంకి : గ్రామ సంఘాలలో ప్రతి ఒక్క మహిళ అభివృద్ధి చెందాలని ఏపిఎం జ్యోతి ప్రసాద్ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో విజన్ ప్రణాళిక నాలుగు రోజుల శిక్షణా కార్యక్రమంలో భాగంగా గురువారం గ్రామ సంఘాల అభివృద్ధి ప్రణాళిక తయారు గురించి గ్రామ సంఘాల పాలకవర్గ సభ్యులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సంఘాలకు కమ్యూనిటీ లెవెల్ ఫెడరేషన్ కార్యాచరణ ప్రణాళిక పై రాబోయే ఐదు సంవత్సరాల కాలంలో ఏఏ కార్యక్రమాలు నిర్వహించుకోవాలో ప్రణాళికలు తయారు చేసుకోవాలో శిక్షణ ఇచ్చారు. సీసీలు బ్రహ్మయ్య విజయరాణి వెంకయ్య పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో దీపక్ రామ్ హర్షిత్‌కు స్వర్ణపతకం

విశాలాంధ్ర - వేటపాలెం : పందిళ్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌కు గర్వకారణంగా, ఆరవ తరగతి విద్యార్థి ఎం. దీపక్ రామ్ హర్షిత్ రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించాడు. నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డి పాలెంలోని సెయింట్ మేరీస్ జూనియర్ కాలేజీలో ఈనెల 9, 10 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన అండర్-14 విభాగం బాల, బాలికల ఫెన్సింగ్ ఫాయిల్ టీం పోటీల్లో అతడు తన ప్రతిభను ప్రదర్శించి రాష్ట్రస్థాయిలో స్వర్ణం దక్కించుకున్నాడు.విద్యార్థి విజయంపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు తలమల దీప్తి హర్షం వ్యక్తంచేశారు. స్టాప్ సెక్రటరీ బుద్ధి మోహనరావు దీపక్ రామ్ హర్షిత్‌ను అభినందిస్తూ రూ.1,000 నగదు బహుమతి అందించారు. ఈ సందర్భంగా పిఈటిలు కర్ణ నాగేశ్వరరావు, తోట వెంకటేశ్వర్లు తదితర పాఠశాల సిబ్బంది, విద్యార్థులు అభిందనలు తెలిపారు.

డిజిటల్ లిటరసీ అవగాహన

విశాలాంధ్ర - కారంచేడు : కారంచేడు మండల పరిధిలోని కారంచేడు గ్రామంలోని పీడీసీసీ బ్యాంకు కార్యాలయంలో సోమవారం డిజిటల్ లిటరసీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బ్యాంకింగ్ సేవలను డిజిటల్ విధానంలో వేగంగా, సురక్షితంగా, పారదర్శకంగా వినియోగించుకోవడం ద్వారా గ్రామీణ మహిళలు తమ ఆర్థిక వ్యవహారాలను మరింత సమర్థంగా నిర్వహించగలరనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. బ్యాంకు మేనేజర్, ఫీల్డ్ ఆఫీసర్, సీసీ, ఏపీఎం టి. మోహనరావు ముఖ్య ప్రసంగాలు చేశారు. డిజిటల్ ట్రాన్సాక్షన్స్, యూపీఐ, ఆన్‌లైన్ బ్యాంకింగ్, సైబర్ భద్రత, ఫ్రాడ్ నివారణ వంటి అంశాలపై విస్తృతంగా వివరించారు.

31న చలో విశాఖ

విశాలాంధ్ర - మార్టూరు : సిఐటియు 18వ జాతీయ మహాసభలను జయప్రదం చేయవలసిందిగా మార్టూరు సిఐటియు మండల శాఖ గురువారం పిలుపునిచ్చింది. సిఐటియు రాష్ట్ర కార్యదర్శులు కే. ఉమామహేశ్వరరావు, దయా రమాదేవి, ముజఫర్ అహ్మద్ ఆధ్వర్యంలో స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం మధ్యాహ్నం నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. డిసెంబర్ 31వ తేదీ నుండి జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో నిర్వహించనున్న 18వ జాతీయ సిఐటియు మహాసభలను కార్మికులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. నాయకులు బత్తుల హనుమంతరావు, వీరవల్లి కృష్ణమూర్తి, బి.సూరిబాబు, శేషాద్రి, సివిల్ సప్లయిస్ కూరగాయల ముఠా నాయకులుటీ. నాగరాజు, ఎం. చిన్నా,బుడే, నారాయణ రెడ్డి, సత్యన్నారాయణ పాల్గొన్నారు.

వైసీపీ ఇన్‌ఛార్జిలకు పోలీసులు నోటీసులు

విశాలాంధ్ర - చెరుకుపల్లి : పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆయన సోదరుడు వెంకటరామిరెడ్డి అరెస్టు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వైసిపి నాయకులకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. రేపల్లె వైసిపి ఇంచార్జ్ డాక్టర్ ఏ ఊరు గణేష్ కు బుధవారం రాత్రి అర్ధరాత్రి 12 గంటలు దాటిన తర్వాత పోలీసులు తనకు నోటీసు ఇచ్చారని మీడియాకు తెలిపారు. సభలు సమావేశాలు నిర్వహించరాదని, ధర్నాలు చేయరాదని, నోటీసులో పొందుపరిచారని తాసు ఉదయాన్నే నిద్రలేచే సమయానికి ఇంటి ముందు పోలీసులు పహారాకాస్తున్నారని ఆయన తెలిపారు.కూటమి ప్రభుత్వం వైసీపీ నాయకుల పై అక్రమ కేసులు బనాయించి ఇదేమిటని అడిగిన వారిని పై కూడా కేసులు పెడుతున్నారన్నారు. రాష్ట్రంలో రెడ్బుక్ రాజ్యాంగం నడుస్తున్నదని అకారణంగా ప్రతిపక్షం గొంతు నొక్కి రాక్షసానందం పొందుతున్నారన్నారు. ప్రజలు జరుగుతున్న పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నారని కూటమి ప్రభుత్వానికి తగిన సమయంలో బుద్ధి చెప్తారన్నారు. ఆయన పార్టీ నాయకులతో హాస్పటల్ ప్రాంగణంలో నిరసన తెలియజేశారు. అలాగే వేమూరు వైసిపి ఇన్చార్జ్ వరి కూటి అశోక్ బాబుకు కూడా పోలీసులు అర్ధరాత్రి సమయంలో నిద్ర లేపి నోటీసులు ఇచ్చారని వారు వచ్చిన సమయంలో రాత్రి ఒంటిగంట అయ్యిందని ఆ సమయంలో వచ్చింది పోలీసుల ఇంకెవరైనా నా అని కొంతసేపు సందిగ్ధంలో పడ్డామన్నారు. ఇంటి వద్దకు పోలీసులు వచ్చే సమయంలో కనీసం ఒక్క లేడీ కానిస్టేబుల్‌ని తీసుకురావాల్సిన అవసరం ఉందని వారికి తెలియకపోవటం విచారకరమన్నారు. ఆయన నివాసం ఉంటున్న ఆది శంకర వ్యాలీలో సుమారుగా 30 మంది పోలీస్ సిబ్బంది ఆయనను బయటకు వెళ్లకుండా 10 గంటల వరకు అడ్డుకున్నారు. ఆయనను నిర్బంధించారన్న వార్త తెలిసిన నియోజకవర్గ శ్రేణులు ఆయన నివాసానికి చేరుకున్నారు. వారితో కలిసి ఆయన స్థానిక ఐలాండ్ సెంటర్లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కూటమి నాయకులను అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఓ పత్రంపై రాసి అంబేద్కర్ విగ్రహానికి సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేపల్లె నియోజకవర్గం లోని మంత్రి ఆయన అనుచరులు పేకాట, కోడిపందాలు, నిర్వహిస్తూ కోట్ల రూపాయలు దోపిడీకి పాల్పడుతున్నారన్నారు.ఇలాంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించే వారిని వదిలిపెట్టి ప్రతిపక్ష నాయకులను నిర్బంధించడం వారిపై కేసులు పెట్టడం అధికార పార్టీకి సిగ్గుచేటు అన్నారు. పోలీసులు అధికార పార్టీ కొమ్ముకాస్తూ వారు చెప్పిందే వేదంగా నడుస్తూ వారి అడుగులకు మడుగులొత్తున్నారన్నారు. పరిపాలన చేతకాక, రైతులను పట్టించుకోక కబుర్లతో కాలక్షేపం చేస్తూ రెడ్ బుక్కు రాజ్యాంగాన్ని అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయి అన్నారు. ఈ కార్యక్రమంలో రేపల్లె, వేమూరు నియోజకవర్గ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సమాజ సేవలో రోటరీ ముందంజ

- విద్య వైద్యం స్త్రీ శక్తి, మౌలిక వసతుల ఏర్పాటు లక్ష్యం
- రోటరీ జిల్లా గవర్నర్ డాక్టర్ ఎస్. వి. రాం ప్రసాద్

విశాలాంధ్ర - మార్టూరు : సేవారంగంలో 120 సంవత్సరాల చరిత్ర కలిగిన రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రపంచవ్యాప్తంగా సేవలు అందించడంలో ముందంజలో ఉందని 3150 రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ఎస్. వి. రాంప్రసాద్ అన్నారు. మార్టూరులో గురువారం అధికారిక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన స్థానిక ఎఫర్ట్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. న్యూయార్క్ నగరంలోని ఇల్లీ నాయిస్ పట్టణంలో 1905వ సంవత్సరంలో ఫాల్స్ హారిస్ స్థాపించిన రోటరీ ఇంటర్నేషనల్ సంస్థ నేడు ప్రపంచంలోని 220 దేశాలలో 46వేల క్లబ్బుల ద్వారా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. పోలియో రహిత సమాజమే లక్ష్యంగా 1985 నుండి ఇప్పటివరకు పోలియో మహమ్మారి నిర్మూలన కోసం రూ.25 వేల కోట్ల ఖర్చు చేసి దాదాపుగా లక్ష్యాన్ని చేరుకున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ దేశాలలో 39 పోలియో కేసులు మాత్రమే ఉన్నట్లు ఆయన తెలిపారు. విద్య,వైద్యం, స్త్రీ శక్తి పర్యావరణం రంగాలపై రోటరీ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలకు బల్లలు కుర్చీలు, ఫ్యాన్లు అందించడం, గ్రామీణ ప్రాంత బాలికలకు సైకిళ్లు పంపిణీ చేయడం పంపిణీ చేయడం, మహిళలకు కుట్టు శిక్షణ ఇప్పించి మిషన్లు ఉచితంగా పంపిణీ చేయడం ద్వారా మహిళా సాధికారతకు చేయూతనివ్వటం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కిడ్నీ రోగులకు డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేయడం, గుండె జబ్బు గల చిన్నపిల్లలకు ఉచితంగా ఆపరేషన్ చేయించడం, రక్తదాన సేకరణ రక్తదాన సేకరణతో ఆయన తెలిపారు. కార్యక్రమాలు భాగంగా ఆయన స్థానిక హర్షిని కళాశాల ఆవరణలో రక్తదాన శిబిరం, డెంటల్ ఐ క్లినిక్ ఏర్పాటు చేసి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. మార్టూరు, నాగరాజు పల్లి గ్రామాలలో మొక్కలు నాటారు. హర్షిని, వివిఎస్ఆర్ అండ్ ఏఎం డిగ్రీ కళాశాలలో18 సంవత్సరాలు నిండిన విద్యార్థులచే రోటరీ క్లబ్ అనుసంధానంగా రోటరాక్ట్ క్లబ్బులను ప్రారంభించారు. కార్యక్రమంలో 31 50 డిస్టిక్ అసిస్టెంట్ గవర్నర్ రవి అంకమ్మ చౌదరి, మార్టూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడు మాదాల సాంబ శివ రావు, కార్యదర్శి, చెరుకూరి నాగేశ్వరావు, ,జె. వి. మోహనరావు, ఆంజనేయులు శానం పూడి లక్ష్మయ్య, చెరుకూరి అంజి బాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ పోల్-టు-పోల్ తనిఖీలు

విశాలాంధ్ర - కారంచేడు : జిల్లా పరిధిలో విద్యుత్ సరఫరా వ్యవస్థను బలోపేతం చేసి వినియోగదారులకు నిరంతరాయంగా, నాణ్యమైన విద్యుత్తును అందించేందుకు విద్యుత్ శాఖ చర్యలు వేగవంతమయ్యాయి. ఈ క్రమంలో గురువారం కారంచేడు మండలంలో సూపరింటెండింగ్ ఇంజినీర్ ఆంజనేయులు విద్యుత్ అధికారులతో కలిసి విస్తృత స్థాయిలో పోల్-టు-పోల్ తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలవ్యాప్తంగా 30 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి జరిగిన ఈ తనిఖీలలో విద్యుత్ వినియోగంలో లోపాలు, అక్రమ కనెక్షన్లు, మీటర్ టాంపరింగ్ వంటి అనైతిక వినియోగాలపై దృష్టి సారించారు. మొత్తం 49 కేసులను గుర్తించి నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.ఈ కేసులపై రూ. 4,16,000 అపరాధ రుసుమును విధించినట్లు చీరాల ఎలక్ట్రికల్ ఇంజినీర్ జాన్ థామస్ పేర్కొన్నారు. ప్రజలు చట్టబద్ధంగా విద్యుత్ వినియోగించాలని అధికారులు సూచించారు.

పాఠశాలలో విద్యాశాఖ అధికారుల తనిఖీ

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : మండలంలోని తిమ్మసముద్రం జేసీసీ ఎయిడ్స్ హైస్కూల్లో గురువారం విద్యాశాఖ అధికారుల బృందం తనిఖీ చేసింది. పాఠశాలలో వార్షిక ఇన్స్పెక్షన్లో భాగంగా తనిఖీ చేసినట్లు ఎంఈవో-2 ఈవీ రమణయ్య తెలిపారు. ఈ బృందంలో ఒంగోలు మండల ఎంఈవో కిషోర్బాబు, హెచ్. నిడమనూరు హెచ్ఎం శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు. ఉపాధ్యాయుల పోస్టుల రికార్డులను పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు వివరించనున్నట్లు తెలిపారు.

సూర్యలంకలో స్వదేశీ దర్శన్ పనులు పరిశీలన

విశాలాంధ్ర - బాపట్ల రూరల్ : సూర్యలంకలో స్వదేశీ దర్శన్ కార్యక్రమం ద్వారా రూ.100 కోట్లతో సూర్య లంకలో ప్రతిపాదించిన అభివృద్ధి పనులు చేపట్టేందుకు వీలుగా ఆక్రమణలు తొలగించి, సదరు బాధితులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయు నిమిత్తం స్థల సేకరణ, మార్కింగ్ పనులు బాపట్ల ఆర్డీవో గ్లోరియా గురువారం పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా డిపివో కే.ఎల్.ప్రభాకరరావు, తహశీల్దార్ షలీమా, మెరైన్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

నామ్ రహదారి విస్తరణకు 3.44కోట్లు మంజూరు

విశాలాంధ్ర - సంతమాగులూరు : ఎట్టకేలకు నార్కెట్‌పల్లి- అద్దంకి - మేదరమెట్ల (నామ్) రహదారి విస్తరణ పనులకు మార్గం సుగమం అయింది. ఈ పనులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ప్రకటన విడుదల చేశారు. గత పదేళ్లుగా భూసేకరణకు అవసరమైన నిధుల మంజూరులో జాప్యం ఏర్పడింది. ఈ కారణంగా అద్దంకి మండలంలోని చక్రాయపాలెం,గోపాలపురం గ్రామాలతో పాటు సంతమాగులూరు మండలం పరిధిలోని ఏల్చూరు గ్రామాల వద్ద రహదారి విస్తరణ పనులు నిలిచిపోయాయి. ఈ అంశాన్ని ముఖ్య మంత్రి చంద్రబాబు దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని సీఎం నామ్ రోడ్డు విస్తరణకు సంబంధించి భూసేకరణకు నిధులు కేటాయించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి గొట్టిపాటి తెలిపారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - నిజాంపట్నం : గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత పశువైద్య శిబిరాలను పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ బాపట్ల జిల్లా అధికారి డాక్టర్ వేణు గోపాల్, పశుసంవర్ధక శాఖ విజయవాడ జేడీ (ఎహెచ్) డాక్టర్ టీవీ సుధాకర్ అన్నారు.మండలంలోని ప్రజ్ఞం గ్రామంలో గురువారం శ్రీ సత్య సాయి బాబా సేవా సమితి వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరాన్ని ముఖ్య అతిథులుగా వారు హాజరై పశుసంవర్ధక శాఖ రేపల్లె ఏడీ బెల్లంకొండ నాంచారయ్య అధ్యక్షతన ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశు పోషకులు పేయ్యి దూడల వీర్యంతో తమ గేదెలను కట్టించుకోవాలని సూచించారు. ఈ శిబిరంలో పశువైద్యులు డాక్టర్ షేక్ కరిముల్లా, డాక్టర్ రంజిత్, డాక్టర్ ఎం.హేమ ప్రియ, సిబ్బంది పాల్గొని పశు వైద్య సేవలు అందించారు.శ్రీ సత్య సాయి సేవా సమితి నుండి విశ్రాంత పశు వైద్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పున్నయ్య శాస్త్రి అవసరమైన మందులను ఉచితంగా సమకూర్చారు.అలాగే శ్రీ సత్యసాయి సేవా సమితి వారు గ్రామంలో 100 జామ మొక్కలను గ్రామస్తులకు అందజేశారు. సర్పంచ్ బసవపూర్ణమ్మ, శ్రీ సత్య సాయి బాబా సేవా సమితి నుండి నాగేశ్వరరావు, మోర్ల శ్రీనివాసరావు, పశు వైద్య సిబ్బంది, పశు పోషకులు పాల్గొన్నారు

జిల్లా విద్యాశాఖాధికారిగా శ్రీనివాసరావు



విశాలాంధ్ర -బాపట్ల : విద్యాశాఖ జిల్లా అధికారిగా డి.శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం నుంచి బాపట్ల జిల్లాకు బదిలీపై వచ్చిన డి.శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్‌ని కలిసి మొక్కను అందజేశారు. అనంతరం డీఈవోగా పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టారు.

రేపల్లెలో క్రిస్మస్ కాంతులు

విశాలాంధ్ర - రేపల్లె : ఈనెల 25వ తేదీన క్రిస్టమస్ పండగ సందర్భంగా నెలరోజుల పాటు జరిగే ఉపవాస దీక్షలో భాగంగా క్రైస్తవ సోదర, సోదరీమణులు పలు చర్చిలలో తెల్లవారుజామున 5 నుండి 6 గంటల వరకు ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా రేపల్లె నియోజకవర్గంలోని పలు గ్రామాలలో రేపల్లె టౌన్ లోని ఐఆర్ఈఎఫ్, లూథరన్, హెూసన్న మందిరాలు.పలు పెంతుకోస్తు క్రీస్తు దేవాలయాల్లో. రంగురంగుల విద్యుత్ దీపాలతో చర్చలను అలంకరించి. చర్చి ముందు క్రిస్టమస్ స్టార్స్ ను ముస్తాబు చేశారు. ఈ స్టార్స్ కనుల విందుగా ప్రజలను ఆకర్షిస్తున్నాయి. క్రిస్టమస్ పండుగ సమీపిస్తూ ఉండటంతో చర్చిలను రంగురంగుల కలర్స్ వేసి విద్యుత్ దీపాలతో క్రిస్టమస్ స్టార్స్ తో అలంకరించారు.

'పది' విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

విశాలాంధ్ర - నిజాంపట్నం : మండలంలోని ముత్తుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 51 మంది విద్యార్థులకు యూటీఎఫ్ ప్రచురించిన స్టడీ మెటీరియల్‌ను నగరం ఇండియన్ బ్యాంక్ శాఖ వారి సౌజన్యంతో గురువారం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం కె.వనజాక్షి మాట్లాడుతూ పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచేందుకు విద్యార్థులు తమ లక్ష్యంపై దృష్టి పెట్టి క్రమశిక్షణతో చదవాలని సూచించారు.విద్యార్థులు ఈ స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించి పాఠశాల గౌరవాన్ని మరింత పెంచాలని ఆకాంక్షించారు.బ్యాంక్ మేనేజర్ కోట ప్రభు కిరణ్ మాట్లాడుతూ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు ఉపయోగపడే ఈ మెటీరియల్ తో విద్యార్థుల్లో పోటీ పరమైన ఆత్మవిశ్వాసం పెరుగుతుందని తెలిపారు.సామాజిక సేవలో భాగంగా విద్యారంగానికి చేయూతనివ్వడం తమ బాధ్యతగానే భావిస్తున్నామని ఆయన చెప్పారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి పన్నులు ఆన్‌లైన్ ద్వారా వసూలు చేయాలి

విశాలాంధ్ర -బాపట్ల టౌన్ : ఇంటి పన్నులు స్వర్ణ పంచాయతీ ద్వారా ఆన్‌లైన్‌లో మాత్రమే స్వీకరించాలని బాపట్ల డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసర్ విజయలక్ష్మి ఆదేశించారు. గురువారం బాపట్ల డివిజన్ పరిధిలోని అందరు డిప్యూటీ ఎంపీడీవోలు మేజర్ గ్రామ పంచాయతీల పంచాయతీ కార్యదర్శులతో బాపట్ల డిడిఓ కార్యాలయంలో డిడిఓ విజయ లక్ష్మి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డివిజన్ పరిధిలో అందరూ ఇంటి పన్నుల కలెక్షన్ ఆన్లైన్ ద్వారానే వసూలు వేగవంతం చేయాలని తెలియజేశారు. గ్రామపంచాయతీలలో సొంత ఆదాయ వనరులు పెంచుకునే విధంగా కృషి చేయాలని తెలియజేశారు. స్వామిత్వ సర్వే ని సత్వరమే పూర్తి చేయాలని,చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ,వేలం పాటలు, బడ్జెట్‌లు తయారీ తదితర అంశాలపై సమీక్షించారు.మార్టూరు మండలంలోని మేజర్ పంచాయతీ కార్యదర్శుల గైర్హాజర్ పై ఆగ్రహించి మెమో జారీ చేశారు.

యేసు క్రీస్తు బోధనలు అనుసరణీయం

విశాలాంధ్ర - నిజాంపట్నం : యేసు క్రీస్తు బోధనలు సర్వ మానవాళికి అనుసరణీయమని టీడీపీ నేత అనగాని శివప్రసాద్ అన్నారు. నిజాంపట్నం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ముఖ్య అతిథిగా అనగాని శివప్రసాద్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన క్రిస్మస్ కేక్ ను ఆయన కట్ చేసి అధికారులకు, సిబ్బందికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం వీఆర్ఏ లకు దుస్తులు పంపిణీ చేశారు.అనగాని శివప్రసాద్ మాట్లాడుతూ యేసు క్రీస్తు చూపిన ప్రేమ, శాంతి, సహనం, సేవాభావం వంటి విలువలు నేటి సమాజానికి ఎంతో అవసరమని చెప్పారు.ప్రతి ఒక్కరూ ఆయన చూపిన మార్గంలో పయనించాలని కోరారు.క్రైస్తవులు ఈ క్రిస్మస్ పండుగను ఎంతో సంతోషంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు నర్రా సుబ్బయ్య, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ బొమ్మిడి రామకృష్ణ, ఎంపీపీ మోపిదేవి హరనాథ్ బాబు, ఎంపీటీసీ నాజర్ ఖాన్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, వీఆర్వోలు, వీఆర్ఏలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉత్తేజానికి దోహదం

విశాలాంధ్ర -సంతమాగులూరు : క్రీడలు మానసిక ఉత్తేజానికి ప్రేరణగా నిలిచి శారీరక దృఢత్వాన్ని పెంచడంతో పాటు ఒత్తిడిని తగ్గించి, ఆనందాన్ని, యువతలో స్ఫూర్తిని, స్నేహభావాన్ని పెంపొందించడంలో దోహదపడతాయని ఖోఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ ఎం.సీతారామిరెడ్డి తెలిపారు. గురువారం పుట్టావారిపాలెంలోని మన బాలభారతి ఇంగ్లీషు మీడియం హైస్కూలులో అకాడమీ డైరెక్టర్ ఒంటెద్దు అంజిరెడ్డి ఆధ్వర్యంలో వార్షిక క్రీడలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథులుగా సీతారామిరెడ్డితో పాటు ఖోఖో అంతర్జాతీయ క్రీడాకారుడు, వరల్డ్ కప్ విన్నింగ్ టీం సభ్యుడు పోతిరెడ్డి శివారెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా సీతారామిరెడ్డి, శివారెడ్డి మాట్లాడుతూ..విద్యార్థులు విద్యతో పాటు క్రీడలపై కూడా దృష్టి సారించాలని సూచించారు. స్పోర్ట్స్ ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని చెప్పారు. పాఠశాల యాజమాన్యం కూడా క్రీడల వైపు పిల్లలను ప్రోత్సహించాలని పేర్కొన్నారు. అనంతరం వాలీబాల్, క్రికెట్, ఖోఖో, కబడ్డీ క్రీడలకు సంబంధించి రిబ్బన్ కట్ చేసి పోటీలు ప్రారంభించారు. తొలిరోజు వాలీబాల్ పోటీలు రసవత్తరంగా జరిగాయి. స్కూలు కరస్పాండెంట్ ఎం.వెంకటేశ్వర్లు, ఛైర్మన్ ఎ.రత్తయ్య పాల్గొన్నారు.

గూడ్స్ రైలు ఢీకొని మహిళ మృతి

విశాలాంధ్ర - సింగరాయకొండ : సింగరాయకొండ మండలం సోమరాజు పల్లి గ్రామపంచాయతీలో రైల్వే ట్రాక్ దాటుతుండగా గూడ్స్ రైలు ఢీకొని అంగన్వాడి టీచర్ మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. మృతి చెందిన మహిళ టంగుటూరు గ్రామానికి చెందిన రమణ గుర్తించామని ఆమె సోమరాజు పల్లిలో అంగన్వాడి టీచర్ గా పనిచేస్తుందని రోజువారి ఉద్యోగ దినచర్య కార్యక్రమంలో భాగంగా రైల్వే ట్రాక్ దాటుతుండగా గూడ్స్ రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందినట్లు, మృతదేహాన్ని ఒంగోలు రిమ్స్ కి తరలించామని జి ఆర్ పి ఎఫ్ ఎస్ ఐ తెలిపారు.

మార్కాపురం జిల్లా ఏర్పాటు హర్షణీయం

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మార్కాపురాన్ని జిల్లా ఏర్పాటుకు ఆమోదం తెలిపినందుకు కృతజ్ఞతగా మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆదేశాల మేరకు గురువారం సాయంత్రం మండలంలోని రేగుమనుపల్లి మరి పాలెం గ్రామాలలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు సీఎం చంద్రబాబు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేసి వారి అభిమానాన్ని చాటుకున్నారు. చంద్రబాబు జిందాబాద్ కందుల నాయకత్వం వర్ధిల్లాలి ,తెలుగుదేశం తోనే అభివృద్ధి సాధ్యమంటూ,పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మండల టిడిపి అధ్యక్షుడు మోర బోయిన బాబురావు టిడిపి నాయకులు కుందూరు కాశిరెడ్డి తెలుగు యువత నాయకుడు పెరికే సుక్కు దేవ్ వెంకటేశ్వర రెడ్డి కనకం నరసింహారావు కాటమరాజు అంకాల రోశయ్య బొరిగర్ల వెంకటేష్ కోడె గురవయ్య జయరాం రెడ్డి గంటా రమణారెడ్డి కోటయ్య ,ఆశిష్ అంజిరెడ్డి ,కోటిరెడ్డి చెన్నారెడ్డి టిడిపి నాయకులు కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

స్క్రబ్ టైఫస్‌పై రివ్యూ



విశాలాంధ్ర- చీమకుర్తి: చీమకుర్తి పురపాలక సంఘం నందు స్క్రబ్ టైఫస్ పై రివ్యూ మీటింగ్ ను కమిషనర్ వై.రామకృష్ణయ్య తన కార్యాలయంలో నిర్వహించారు. స్క్రబ్ టైఫస్ అనే జ్వరం ఎక్కువగా పొలాల్లో పనిచేస్తున్న మరియు గడ్డి పైన ఆడుకునే పిల్లల్లో ఎక్కువగా కనిపిస్తుందని, స్క్రబ్ టైఫస్ అనే వ్యాధి చిన్న కీటక కాటు వలన వస్తుందని సరైన సమయంలో దాని గుర్తించి చికిత్స చేయటం ఎంతో అవసరం అని చిగురుటాకు అని చిన్న కీటకం ఈ బ్యాక్టీరియాని వ్యాప్తి చేస్తుంది అని తెలిపారు. ఇది గడ్డి మరియు పొలాల్లో ఎక్కువగా ఉంటుంది ఈ కీటకం కుట్టినప్పుడు బ్యాక్టీరియా రక్తంలోకి చేరుతుంది కాటు వేసిన మూడు నుంచి పది రోజుల్లో లక్షణాలు కనిపిస్తాయి కాటు ఉన్నచోట నల్లటి మచ్చ ఇది ముఖ్య గుర్తు, అధిక జ్వరం రావడం తలనొప్పి కండరాల నొప్పి రావడం జరుగుతుందని కావున పట్టణ ప్రజలు దీనిపై అవగాహన కలిగి తగిన జాగ్రత్తలు పాటించవలసిందిగా కోరడమైనదని కమిషనర్ వై. రామకృష్ణయ్య పురపాలక సంఘం సభ్యులకు పురపాలక సంఘంలోని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

అవగాహన లేని మాస్టర్ ప్లాన్

సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ

విశాలాంధ్ర -బాపట్ల : బాపట్ల పట్టణం భవిష్యత్తు అభివృద్ధికి సంబంధించిన దీర్ఘకాలిక ప్రణాళిక మాస్టర్ ప్లాన్ అవగాహన లేకుండా రూపొందించారని సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ ఆరోపించారు. పురపాలిక సంఘంలో గురువారం రాజకీయ పార్టీలు స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు పట్టణ ప్రజలతె కమీషనర్ రఘునాథరెడ్డి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సింగరకొండ మాట్లాడుతూ కోస్టల్ రెగ్యులైజేషన్ 2019 ప్రకారం బాపట్ల తీర ప్రాంతం జోన్ 3బి కిందకు వస్తుందని అలాంటప్పుడు తీరం నుండి 200 మీటర్లు నాన్ డవలప్‌మెంట్ జోన్ ఎందుకు గుర్తించలేదన్నారు. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల నుంచి నూతన బైపస్ వరకు ఉన్న ఆది ఆంధ్ర సొసైటీకి సంబంధించిన అసైన్డ్ భూములను ఏలా ప్రకటిస్తారని ప్రశ్నించారు. పడమర బాపట్ల రెవెన్యూ గ్రామ పరిధిలో బాపట్ల ఇంజనీరింగ్ కాలేజీకి ఆనుకుని ఉన్న సర్వే నెం.1399 కమర్షియల్ జోన్‌గా ఎందుకు ప్రకటించారన్నారు. డెఫ్ అండ్ డెమ్ స్కూల్ వెనుక ఉన్న అసైన్డ్ భూములు వర్క్ సెంటర్‌గా ఏలా ప్రకటిస్తారని ప్రశ్నించారు. జగన్ కాలనీ పక్కన ప్రవేట్ భూములలో వర్క్‌జోన్ ఏలా ప్రకటిస్తారన్నారు. పట్టణంలో ఉన్న ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌ను వర్క్ సెంటర్‌గా ఎందుకు మార్పు చేశారన్నారు. తవ్వకాలువకు ఇరువైపుల రోడ్లుకు ఇరువైపుల ఉన్న వారికి నష్టపరిహారం ఇస్తారా అని ప్రశ్నించారు. శిఖరం వారివీధిని 40 అడుగులు ఎందుకు చేయటం లేదని అధికార పార్టీ నేతల ఆస్తులు కోల్పోతారని మిన్నకుండిపోయారా అని సింగరకొండ నిలదీశారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి : కలెక్టర్

విశాలాంధ్ర -బాపట్ల : ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా వైద్యాధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ జిల్లాస్థాయి కమిటీ సమావేశం గురువారం స్థానిక కలెక్టరేట్ లో జరిగింది.ఎన్టీఆర్ వైద్య సేవలు ప్రజలకు సక్రమంగా అందించాలని కలెక్టర్ చెప్పారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఆరోగ్యశ్రీ కార్డులు అందించాలన్నారు. పిఎంజెఏ వై కార్డులను లబ్ధిదారులైన ఆయా కుటుంబాలకు అందించాలన్నారు. ప్రధానమంత్రి ఆరోగ్య కార్డుల ఈకేవైసీ జిల్లాలో 9,600 పెండింగ్ లో ఉన్నాయన్నారు. లబ్ధిదారుల ఈకేవైసీ తప్పనిసరిగా చేపట్టాలన్నారు. వైద్యశాలల్లో ఔషధాల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఔషధాల కొరకు ముందస్తు ఇండెంట్ పంపాలని సూచించారు. జిల్లాకు సరిపడా మందులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. బాపట్ల జిల్లా తీర ప్రాంతం కావడంతో మొక్కలు, చెట్లు అధికంగా ఉన్నందున పాముకాటుకు గురైన వారికి తక్షణమే వైద్యం అందించేందుకు ఔషధాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రతి వైద్యశాలలో సంబంధిత ఔషధాలు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రజల ప్రాణాలకు ఎలాంటి హాని జరగకుండా వైద్యాధికారులు మంచి వైద్యం అందించాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన వైద్యం అందించాలన్నారు. ప్రజల నుంచి మంచి స్పందన లభించేలా మీ సేవలు విస్తృతం కావాలని అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్ విజయమ్మ, ఏపీ వైద్య విధాన పరిషత్ జిల్లా కోఆర్డినేటర్ పద్మావతి, ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ డాక్టర్ ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

మండ్లపాడులో చిల్ల చెట్ల తొలగింపు

విశాలాంధ్ర-సిఎస్ పురం : మండల కేంద్రం ఎస్ పురం పంచాయతీ పరిధిలోని ముండ్లపాడు గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చిల్ల చెట్లు వాహనదారులకు ప్రజలకు తీవ్ర అంతరాయంగా మారాయి. ఈ సమస్యపై గ్రామస్తులు టిడిపి నాయకులు దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించిన మండల టిడిపి అధ్యక్షులు బొబ్బూరి రమేష్ రోడ్డును పరిశీలించి, గురువారం జెసిబి యజమానితో మాట్లాడి యంత్రాన్ని పిలిపించి రోడ్డుకు ఇరువైపులా ఉన్న చిల్ల చెట్లను తొలగించే చర్యలు తీసుకున్నారు. పనులు ప్రారంభించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బొబ్బూరి రమేష్ మాట్లాడుతూ గ్రామస్తుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి కృషితో గ్రీన్ ఫీల్డ్ రోడ్లు, నేషనల్ హైవే రోడ్లతో మన ప్రాంత అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని అన్నారు పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపుల పెరిగిన చిల్ల చెట్లను తొలగించి సమస్యను పరిష్కరించిన బొబ్బూరి రమేష్ కి టిడిపి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మండల టిడిపి మాజీ ప్రధానకార్యదర్శి మన్నేపల్లి శ్రీనివాసులు, ఉప సర్పంచ్ పాములపాటి నరసయ్య, మండల ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షులు కూటగుళ్ల మహబూబ్ బాషా, మాజీ మండల పార్టీ అధ్యక్షులు గ్రంధి హేమ సుందరం, మండల తెలుగు రైతు ఉపాధ్యక్షులు గజ్జల కోటిరెడ్డి, మండల ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బలబద్ర రవి, పట్టణ టిడిపి ప్రధాన కార్యదర్శి రేనాటి వెంకటేశ్వర్లు, పట్టణ తెలుగు యూత్ అధ్యక్షులు తోట చిన్న, మండల టిడిపి యూత్ ఉపాధ్యక్షులు బోయిన మాల కొండయ్య, టిడిపి నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

దూడ,ఎస్ఎస్ఎస్ సెమన్ కార్యక్రమాలపై అవగాహన

విశాలాంధ్ర-సిఎస్ పురం : మండల కేంద్రం సి ఎస్ పురం పంచాయతీ పరిధిలోని ముండ్లపాడు గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వ పశుగణాభివృద్ధి సంస్థ మరియు రాష్ట్రీయ గోకుల మిషన్ వారి ఆర్థిక సౌజన్యంతో గురువారం నిర్వహించిన పశువుల గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని మండల టిడిపి అధ్యక్షులు బొబ్బూరి రమేష్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. శిబిరంలో పశు వైద్య అధికారులు, వెటర్నరీ నిపుణులు పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్సలను అందించారు 28 పశువులకు గర్భకోశ వైద్య పరీక్షలు, 21 పశువులకు సాధారణ కేసులు, 54 కాఫ్ డివార్మింగ్ చికిత్సలు నిర్వహించారు అనంతరం రైతులకు మినరల్ మిక్సర్ మల్టీ విటమిన్ టాబ్లెట్స్, లివర్ టానికులు పంపిణీ చేశారు. ఏడాదికి ఒక దూడ మరియు ఎస్ఎస్ఎస్ సెమన్ కార్యక్రమాలపై రైతు సోదరులకు పశు వైద్యాధికారులు అవగాహన కల్పించారుఈ సందర్భంగా బొబ్బూరి రమేష్ మాట్లాడుతూ పశుసంపద అభివృద్ధికి ఎన్డిఏ కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని పేర్కొన్నారు. రైతుల జీవనోపాధిలో పశువుల పాత్ర ఎంత ముఖ్యమో గుర్తించి, వాటి ఆరోగ్యం పరిరక్షణకు ప్రభుత్వం వివిధ పథకాలు, శిబిరాలు నిర్వహిస్తుందని పశువుల గర్భకోశ సంబంధిత వ్యాధులను గుర్తించి, సమయానికి చికిత్స అందించేలా ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు రైతులకు మేలు చేస్తాయని పేర్కొన్నారు. పశువుల ఆరోగ్యవృద్ధి వల్ల పాల ఉత్పత్తి పెరిగి, రైతుల ఆదాయం మెరుగుపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రాంతీయ పశు వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్ రమేష్, మండల పశు వైద్య అధికారి డాక్టర్ షేక్ మునీర్,1962 సంచార పశు ఆరోగ్య సేవ డాక్టర్ పి జయ వెంకట సాయి, మండల మాజీ టిడిపి ప్రధాన కార్యదర్శి మన్నేపల్లి శ్రీనివాసులు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు గ్రంధి హేమసుందరం, గ్రామ పార్టీ అధ్యక్షులు కోటిరెడ్డి, మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు కూటగుళ్ల మహబూబ్ బాషా, ఉప సర్పంచ్ పాములపాటి నరసయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శి రేనాటి వెంకటేశ్వర్లు, పట్టణ యూత్ అధ్యక్షులు తోట చిన్న, ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బలబద్ర రవి, వివిధ మండలాల పశు వైద్యాధికారులు, మండలంలోని పశు వైద్య సహాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

భాషపై పట్టు, గణితంలో అవగాహన తప్పనిసరి

విశాలాంధ్ర -కంభం : పాఠశాల విద్యార్థులందరికీ ప్రాథమిక దశలో భాషపై పట్టు, గణితంలో అవగాహన తప్పనిసరని ఎంఈవోలు అబ్దుల్ సత్తార్, శ్రీనివాసులు అన్నారు. గురువారం స్థానిక వాసవి విద్యా నికేతన్ లో గ్యారెంటీ ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసి 75 రోజుల కార్యాచరణ ప్రణాళిక10వ తరగతి విద్యార్థుల వంద రోజుల ప్రణాళికలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రణాళికల అమలు విధివిధానాలను వివరించారు. పునాది అభ్యసనలో చతుర్విధ ప్రక్రియలపై అవగాహన చదవడం వ్రాయడం లాంటి కనీస సామర్థ్యాల సాధన లక్ష్యంగా ప్రణాళికలను అమలుపరిచేందుకు ఉపాధ్యాయులు సంసిద్ధం కావాలని తెలిపారు. జంగంగుంట్ల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు గని. వెంకటేశ్వర్లు, రిసోర్స్ పర్సన్లు ఎం.రమేష్, 10వ తరగతి విద్యార్థుల 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు గురించి వివరించగా, డి.రాజేష్ ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసి అమలు నేపథ్యాలను వివరించారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిఆర్ఎంటీలు, ఉపాధ్యాయులు, ఎంఈవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ ఉపసర్పంచ్‌గా రవిశంకర్ ఎన్నిక

విశాలాంధ్ర - సింగరాయకొండ : సింగరాయకొండ గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం జరిగిన ఉపసర్పంచ్ ఎన్నికలో గ్రామ పంచాయతీ బుంగ భావి ప్రాంత ప్రజా ప్రతినిధి ఓలేటి రవి శంకర్ రెడ్డి ఎన్నికైనట్లు అధికారికంగా ప్రకటించారు. ఉప సర్పంచ్ ఎలక్షన్ అధికారిగా మండల ఎంపీడీవో జయమణి నిర్వహించగా సింగరాయకొండ పంచాయితీ పరిధిలోని 18 వార్డ్ నెంబర్లులో 12 వార్డ్ నెంబర్లు ఓలేటి రవిశంకర్ రెడ్డిని ఉప సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. అనంతరం ఎన్నికైన ఉప సర్పంచ్ రవిశంకర్కు ఎంపీడీఓ జయమణి అధికారిక ధ్రువీకరణ పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షులు మించల బ్రహ్మయ్య, కోనపు రెడ్డి సుబ్బారావు, సుదర్శి చంటి, బీసీ సెల్ నాయకులు ఎస్ కె ఎస్దాని, బచ్చే, మరియు టిడిపి అధికార పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

విశాలాంధ్ర - పొదిలి : స్థానిక విశ్వనాథపురంలోని బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థుల మధ్యాహ్న భోజనాన్ని యంపిడీఓ శ్రీనివాసరావు ఆకస్మిక తనిఖీ చేయడం జరిగింది. వంట వండిన ఆహార పదార్థాలు, బియ్యాన్ని పరిశీలించడం జరిగింది. విద్యార్థులను భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులుకు భోజనాన్ని విద్యార్థులకు మంచిగా అందించాలని, వారికి ఏకొరత లేకుండా చూసేవిధంగా చూడాలని తెలియజేశారు. లేకపోతే భోజనం అందించే ఏజెన్సీని వెంటనే రద్దు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈయన వెంట సిబ్బంది ఉన్నారు.

అర్హులకు పింఛన్లు మంజూరు చేయాలి

మునిసిపల్ ఛైర్మన్ అబ్దుల్ గఫార్

విశాలాంధ్ర-కనిగిరి : అర్హులైన ప్రతి ఒక్కరికి నూతన పెంక్షన్స్ మంజూరు చేసి ప్రభుత్వం ప్రజలను ఆదుకోవాలని మున్సిపల్ ఛైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. గురువారం కనిగిరి పట్టణంలోని గార్లపేట రోడ్డులోని 12వ సచివాలయమును ఆకస్మికంగా తనిఖీ చేసి మూమెంట్ రిజిస్టర్ హాజరు పట్టికలను తనిఖీ చేశారు. అనంతరం సంక్షేమ పథకాలు అండటంలేవని అర్హత కలిగిన పెంక్షన్స్ మంజూరు చేయడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ ఛైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ద్రాక్షాల మారాయని ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్క లబ్ధి దారులకు నూతన పెంక్షన్స్ మంజూరు చేయాలన్నారు. సచివాలయంలోని అధికారులు ప్రభుత్వనికి ప్రజలకు మధ్య జవాబు దారిగా పనిచేయాలని ఆయన కోరారు.

పాఠశాలను సందర్శించిన ఎంపీడీవో

విశాలాంధ్ర-కంభం : కంభం మండలంలోని రావిపాడు జిల్లా పరిషత్ స్కూల్ నుఎంపిడివో వీర భద్రాచారి సందర్శించారు. విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పదవ తరగతి విద్యార్థులతో ఇంటరాక్ట్ అయి వారి వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను అవగాహన కల్పించారు. ఈ వందరోజుల స్టడీ పేపరేషన్ అడిగి తెలుసుకుని కొన్నిసూచనలు తెలిపారు. విద్యార్థుల ప్రేపరషన్ పై అడిగి సంతృప్తి వ్యక్తం చేసారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరీక్షించి విద్యార్థులతో పాటుగా భోజన చేశారు. మెనూ ప్రకారం సమయానికి మంచి భోజనం అందించాలని పేర్కొన్నారు.

అగ్నాస్త్రంతో పురుగు నివారణ

విశాలాంధ్ర - అద్దంకి : అగ్ని అస్త్రంతో పంటలలో పురుగు నివారణ చేసుకోవచ్చని మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. గురువారం మండలంలోని గోవాడలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో భాగంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ 100 లీటర్ల గోమూత్రంలో వేప, గానుగ, జిల్లేడు, పొగాకు ఆకులను మరియు పచ్చి మిరపకాయలు 5 కేజీలు మరియు చిన్నుల్లి 2 కేజీలు కలిపి బాగా మరిగించి 48 గంటలు బాగా ఆరబెట్టిన తరువాత వడ పోసుకొని పంట పై పిచికారీ చేసుకున్నట్లయితే పెద్ద పురుగులు మరియు అన్ని రకాల పురుగులు చనిపోతాయని తెలిపారు.వరి పంటకి సంబంధించిన పురుగులు, తెగుళ్ళు, సూక్ష్మ పోషకాలు లోపాలు ఉన్న మరియు వాటి నివారణ చర్యలు కలిగిన పుస్తకాలు రైతులకు అందించారు.కార్యక్రమం లో గ్రామ ఉద్యాన సహాయకురాలు శ్రీలక్ష్మి వ్యవసాయ విస్తరణ అధికారులు కోటేశ్వరరావు, రేణుక,రైతులు పుట్టా సాంబశివరావు నరిశెట్టి రమేష్ బాబు మాకినేని ఏడుకొండలు నరిశెట్టి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

19న రేపల్లె మునిసిపల్ కౌన్సిల్ బడ్జెట్ సమావేశం

విశాలాంధ్ర - రేపల్లె : రేపల్లె మున్సిపల్ కౌన్సిల్ బడ్జెట్ సమావేశం ఈనెల 19వ తేదీ ఉదయం 11 గంటలకు మునిసిపల్ కౌన్సిల్ హాల్ నందు వివిధ అంశముతో బడ్జెట్ సమావేశం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు తెలిపారు. చైర్ పర్సన్ కట్టమంగ అధ్యక్షత వహిస్తారు కావున కౌన్సిల్ సభ్యులు, కో- ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ వివిధ విభాగాల అధికారులు తగు సమాచారంతో సమావేశానికి హాజరు కావలసిందిగా కమిషనర్ కోరారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన వెంకటేష్

విశాలాంధ్ర - చీరాల రూరల్ : దేశాయిపేట గ్రామంలో శవనం మోషా కుమారుడు ఎబినేజర్ మరియు జ్యోతి లా వివాహ మహోత్సవ కార్యక్రమానికి చీరాల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కరణం వెంకటేష్ బాబు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కట్టా గంగయ్య, మాజీ మండల పార్టీ అధ్యక్షులు బొడ్డు సుబ్బారావు, చీరాల పట్టణ పార్టీ అధ్యక్షులు యాతం మేరి బాబు, మున్సిపల్ కౌన్సిలర్లు బత్తుల అనిల్, కంపా అరుణ్, చీరాల నియోజకవర్గ యూత్ అధ్యక్షులు బండికళ్ళ నరేష్ పాల్గొన్నారు.

అన్నం సతీష్‌కు శుభాకాంక్షలు

విశాలాంధ్ర -బాపట్ల టౌన్ : మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ కు పుట్టినరోజు సందర్భంగా మాజీ సైనికులుతో కలసి మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తాండ్ర సంబశివరావు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలియ జేసిన వారిలో బాపట్ల అసోసియేషన్ అధ్యక్షులు పుట్టా ఆదిశేషా రెడ్డి, ఉపాధ్యక్షులు చలికొండ వెంకట కృష్ణారావు, జనరల్ సెక్రెటరీ షేక్ మొయినుద్దీన్, ట్రెజరర్ పువ్వాడ యల్లమంద, జాయింట్ సెక్రెటరీ పీటా సారధి, సీనియర్ మాజీ సైనికులు తోట దుర్గారావు, జిల్లా అసోసియేషన్ ట్రెజరర్ షేక్ నిజాముద్దీన్, డి వెంకటేశ్వర్లు, రుక్మదరరావు పాల్గొన్నారు.

మహారాజశ్రీ 7వ అదనపు జిల్లా జిడ్జి వారి కోర్టు ఒంగోలు

A.S.No. 15/2024

జల్లిపల్లి దుర్గారావు - అప్పీలెంట్

వర్సెస్

జల్లిపల్లి వెంకటేశ్వరరావు మరియు ఇంకొకరు - రెస్పాండెంట్లు

To

2వ రెస్పాండెంట్,

యడ్లపల్లి శివప్రసాద్, తండ్రి సుబ్బారావు,

ప్రొప్రయిటర్ ఆఫ్ క్రిషి వైన్స్, డి.నెం.2-143,

కడవకుదురు గ్రామం,

చినగంజాం మండలం, బాపట్ల జిల్లా.

పై నెంబరు కేసులో మీరు **2వ రెస్పాండెంట్** అయియున్నారు. మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినను మీకు చేరనందున శ్రీ కోర్టువారు మీకు నోటీసు నిమిత్తం విశాలాంధ్ర డైలీ న్యూస్ పేపరు బాపట్ల జిల్లా ఎడిషన్లో పబ్లికేషన్ ద్వారా మీకు తెలియపరచుటకు ఆర్డరు వేసినారు. మీరు ఈ ప్రకటనను చూసిన పిదప **తేది: 23-12-2025 ఉదయం 10:30 గంటలకు** మీరు గానీ, మీ తరపున లాయరు గానీ కోర్టువారి ఎదుట పై తెలిపిన అప్పీల్లో హాజరై అభ్యంతరాలు ఉన్న యెడల తెలుపుకోవలెను. అట్లు మీరు హాజరు కాని యెడల మీకు ఎలాంటి ఆక్షేపణలు లేవని భావించి పై తెలిపిన అప్పీల్‌ను కోర్టువారు మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

పంగులూరి గోవిందయ్య,

వాది తరఫున న్యాయవాది, ఒంగోలు.

ఒంగోలు, తేది:10-12-2025